بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 7 సంచిక : 39

వార్షిక చందా 600/-రూ॥

29 సెప్టెంబర్ 2022 క్రీ, శ. 02 రబీఉల్‌అవ్వల్ 1444 హి,ఖ. 29 తబూఖ్ 1401 హి, శ.

## పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు

وَاكْتُبْ لَنَا فِيْ هٰذِهِ الدُّنْيَا حَسَنَةً وَّفِي الْاٰخِرَةِ اِنَّا هُدْنَآ اِلَيْكَ

**అనువాదం:** " మా కొరకు ఈ ప్రపంచములో కూడ, పరలోకములో కూడ పుణ్యమును వ్రాయుము. నిశ్చయముగా మేము నీ వద్దకు (క్షమాపణ కోరుచు) వచ్చిన వారము."

**(ఆరాఫ్: 157).**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ وَبَارِكْ لَنَا فِيْ عُمُرِهٖ وَاَمْرِهٖ

**అవసరం ఉన్న వారికి తన సంపదలో నుండి ఏమియు దానం చేయని వాడు ఒక్కడే పిసినారి కాదు. అల్లాహ్ తాలా విజ్ఞానంను ప్రసాదించి నప్పుడు దానిని ఇతరులకు నేర్పకుండా తప్పించుక తిరుగువాడు కూడ పిసినారియే అనబడును.**

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఉపదేశాలు:**

గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, అవసరం ఉన్న వారికి తన సంపదలో నుండి ఏమియు దానం చేయని వాడు ఒక్కడే పిసినారి కాదు. అల్లాహ్ తాలా విజ్ఞానంను ప్రసాదించి నప్పుడు దానిని ఇతరులకు నేర్పకుండా తప్పించుక తిరుగువాడు కూడ పిసినారియే అనబడును. ఒకవేళ నేను అతనికి పనితనంను నేర్పినచో మాకు విలువ ఉండదు, మాకు వచ్చే ఆదాయంలో కోత పడుతుంది అని భావించేవారు కూడ విగ్రహారాధకులే అనబడుతారు. ఎందుకనగా ఈ స్థితిలో అతడు తన విజ్ఞానంనే తన సంపదగా, తన సర్వస్వంగా (దేవుడిగా) భావిస్తుంటాడు. అదే విధముగా తనలో ఉన్న ఉత్తమ గుణగణాలను ప్రదర్శించని వాడు కూడ పిసినారియే. గుణగణాలను ప్రదర్శించడం అనగా అల్లాహ్ తాలా తన అనుగ్రహంతో అతనిలో జనింపజేసిన మంచి లక్షణాలతో అతని ప్రాణుల పట్ల వ్యవహరించాలి. అప్పుడు అతని మంచి లక్షణాలను, అలవాట్లను చూసి వారు కూడ తమలో ఆయా లక్షణాలను అలవర్చుకొనుటకు ప్రయత్నిస్తారు.

మంచి లక్షణాలు అంటే కేవలం సున్నితముగా మాట్లాడడం, సుతి మెత్తని పదాలను ఉచ్చరించడం కాదు. ధైర్యం, గౌరవం, ప్రతిష్టలు. మానవునికి అనుగ్రహించబడిన శక్తి సామర్థ్యములన్నియు సద్గుణాలే అనబడుతాయి. వాటిని సమయ స్ఫూర్తితో అమలు పర్చడాన్నే ఉత్తమ లక్షణం అని అంటారు. కొన్ని సందర్భాలలో కోపగించుకోవడం కూడ ఉత్తమ లక్షణమే అనబడుతుంది. (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 393)

ఒక సూక్తిని మార్చి దాని స్థానంలో మరొక సూక్తి ని పొందుపర్చినట్లుగా ఎక్కడ కూడ చారిత్రక ఆధారం లభించడం లేదు. సాధారణముగా ఖుర్‌ఆన్ కరీంలో ఉపయోగించిన ఆయతన్ యొక్క పదానికి అర్థం కొన్ని సార్లు ఆకాశ సంకేతముగా కూడ చెప్పుకో వచ్చును. ఆ అర్థమే ఇక్కడ సరైనది.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్హు అన్నహల్ అధ్యాయపు 102వ సూక్తి వ ఇజా బద్దల్నా ఆయతన్ మ్మకాన ఆయతిన్ వ్వల్లాహు అఅలము బిమా యునజ్జిలు ఖాలూ ఇన్నమా అంత ముఫతరిన్ బల్ అక్సరుహుం లా యఅలమూన్అనువాదం: " వేము ఒక సూక్తిని మార్చి దాని స్థానములో మరొక సూక్తిని తెచ్చెదము. అల్లాహ్ అవతరింప జేయు దానిని మంచిగా ఎరుగును. అప్పుడు వారు ఇట్లందురు. " నీవు కేవలం అబద్ధముగా కల్పితము చేయువాడవు." కాని నిజమునకు వారిలో పలువురు ఎరుగరు."ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు: చాలా మంది విశ్లేషకులు ఈ సూక్తిని ఈ విధముగా అనువాదించారు. ఖుర్‌ఆన్ కరీం యొక్క ఒక సూక్తిని మార్చి మరొక సూక్తిని అవతరింపజేసినప్పుడు, అవిశ్వాసులు " నీవు అసత్యవంతుడవు. ఒకవేళ ఖుర్‌ఆన్ దేవుని గ్రంథమే అయినచో అతడు సూక్తులను ఎందుకు మార్చుతున్నాడు'' అని ఆరోపణలు చేసేవారు.

కాని నా దృష్టిలో ఇది సరైన అనువాదం కాదు. ఎందుకనగా ఒక సూక్తిని మార్చి దాని స్థానంలో మరొక సూక్తి ని పొందుపర్చినట్లుగా ఎక్కడ కూడ చారిత్రక ఆధారం లభించడం లేదు. ఒకవేళ అదే (మార్పులు) జరిగినచో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత కాలంలోనే ఖుర్‌ఆన్ కంఠస్తం చేసిన వందలాది మంది అనుచరులు ముందుగా మాకు ఫలాన సూక్తి తరువాత ఈ సూక్తిని నేర్పించడం జరిగింది. కాని ఆ తరువాత దాని స్థానంలో మరల ఈ సూక్తిని నేర్పించారని సాక్ష్యాన్ని ఇచ్చేవారు. ఇలాంటి సాక్ష్యాలు లేకపోవడం వలన అవన్నియు కేవలం కల్పితాలు, ఊహాగానాల వలనే ప్రాచుర్యంలోకి వచ్చాయి కాని సరైన విజ్ఞానంతో కాదని స్పష్టముగా తెలుస్తుంది.

కొన్ని ఆదేశాలు దైవ ప్రవక్త (స) కాలంలోమార్చబడ్డాయి అనడాన్ని నేను తిరస్కరించడం లేదు. కాని ఖుర్‌ఆన్ కరీంలోని ఆదేశాల విషయంలో ఇలా జరిగినట్లుగా అనగా ముందుగా ఈ విధముగా కొనసాగింది కాని తరువాత ఈ విధముగా మార్చబడింది అనే ఎలాంటి ఆధారాలు లభించడం లేదు. నా దృష్టిలో తాత్కాలిక ఆదేశాలు దైవవాణి రహిత మరియు ఖుర్‌ఆన్ ఆదేశాల రహితముగా కొనసాగేవి. అవి ఖుర్‌ఆన్ సూక్తుల ద్వారా అవతరించేవి కావు. అందుకే ఖుర్‌ఆన్ కరీంలో మార్పు చేయవలసిన అవసరం రాలేదు.

ఇప్పుడు ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. అదేమనగా ఒకవేళ ఖుర్‌ఆన్ సూక్తులు మార్చనిచో మరి ఈ సూక్తియొక్క అర్థమేమిటి?. ఇందుకు సమాధానం ఏమిటనగా, సాధారణముగా ఖుర్‌ఆన్ కరీంలో ఉపయోగించిన ఆయతన్ యొక్క పదానికి అర్థం కొన్ని సార్లు ఆకాశ సంకేతముగా కూడ చెప్పుకో వచ్చును. ఆ అర్థమే ఇక్కడ సరైనది. అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. మేము ఒక సంకేతాన్ని మార్చి దాని స్థానంలో మరొక సంకేతాన్ని తీసుకవచ్చెదము. ఇలా జరుగడం ఆరోపణలకు కారణం కాదు. ఎందుకనగా ఏ సంకేతం ఏ సమయంలో ఉత్తమమైనదో అది అల్లాహ్‌కే బాగుగా తెలియును. కాని అవిశ్వాసులు మాత్రం ఆరోపణలు చేస్తుంటారు. నీవు అసత్య వంతుడవు అని పలుకుతుంటారు. కాని ఈ ఆరోపణలు వారి మూర్ఖత్వానికి నిదర్శనాలు. ఈ ధర్మ చట్టం ప్రతి ప్రవక్త కాలంలో బహిర్గతం అవుతుఉంటుంది.

(తదుపరి సంచికలో)

(తఫ్సీరే కబీర్ సంపుటి 4, పుట 236, ప్రచురణ ఖాదియాన్ 2010)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(2093) హజ్రత్ సొహెల్ బిన్ సఅది రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు. వారు ఇలా తెలిపారు. ఒక మహిళ బుర్దాను తీసుకొని వచ్చింది. బుర్దా అంటే ఏమిటో మీకు తెలుసా? అని మరల అడిగారు. ఆందుకు తెలుసు, అది అంచుకల్గిన దుప్పటి అని సమాధానం ఇచ్చారు. ఆ మహిళ ఇలా విన్నవించుకున్నది. ఓ రసూలుల్లాహ్! నేను ఈ దుప్పటిని మీకు బహూక రించడం కోసం నా చేతులతో తయారు చేశాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ దుప్పటిని తీసుకున్నారు. హుజూర్ (స)కు ఆ దుప్పటి అవసర ముండెను. ఆ తరువాత హుజూర్ (స) ఆ దుప్పటిని తమ ఒంటిపై వేసుకొని మా వద్దకు బయటికి వచ్చారు. ప్రజలలో నుండి ఒక వ్యక్తి ముందుకు వచ్చి ఓ రసూలుల్లాహ్ ! ఆ దుప్పటిని నాకు ఇవ్వండి. నేను దానిని వాడుకుంటాను అని యాచించాడు. అందుకు హుజూర్ (స) సరే అని అన్నారు. ఆ తరువాత కొంత సమయం హుజూర్ (స)సమావేశంలో కూర్చున్నారు. మరల ఇంట్లోకి వెళ్ళి ఆ దుప్పటిని మడత వేసి ఆ వ్యక్తికి ఇచ్చారు. ప్రజలు అతనితో నీవు చేసిన పని ఏమి బాగాలేదు , హుజూర్ (స) ఏదియు కాదని అనరనే విషయం నీకు తెలిసి కూడ నీవు ఎందుకు అడిగావు అని మంద లించారు. అందుకు ఆ వ్యక్తి 'దేవుని ప్రమాణం! నేను మరణించినచో నా శవ వస్త్రం కోసమని దానిని యాచించాను అని సమాధానం ఇచ్చాడు. హజ్రత్ సొహెల్ రజి ఇలా అన్నారు. ఆ దుప్పటియే ఆ వ్యక్తికి శవ వస్త్రంగా ధరింపజేశారు. (బుఖారి కితాబుల్ బుయూఉ సంపుటి4, ప్రచురణ 2008).

**ఈ సంచికలోని అంశాలు:**

1 ⇔ జుమా ప్రసంగం 05 ఆగష్టు 2022 ............ 2వ పేజిలో.

2 ⇔ జుమా ప్రసంగం 12 ఆగష్టు 2022...... 6వ పేజిలో.

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

అల్లాహ్ తాలా అనుగ్రహం వలన 2019వ సంవత్సరం తరువాత ఈ సంవత్సరం జల్సా సాలాన  ఇంగ్లాండ్ పెద్ద ఎత్తున నిర్వహించబడుచున్నది. గత సంవత్సరం కూడ జల్సాను నిర్వహించాము. కాని పరిమిత సంఖ్యలో నిర్వహించడం  జరిగింది. ఈ సంవత్సరం నిర్వహించు ఈ జల్సా కూడ నిజానికి కేవలం ఇంగ్లాండ్ దేశ జమాఅత్‌ల వరకే పరిమితం చేయబడింది. కాని విదేశాల నుండి కూడ పరిమిత సంఖ్యలో పాల్గొనుటకు వస్తున్నారు.

సేవకులకు కూడ ఈ సందర్భముగా తెలియజేయునదేమనగా,  జల్సా కు చెందిన ఈ మూడు రోజులలో హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథులకు సేవచేయుచున్నప్పుడు మేము మా అధికారుల నుండి గాని, లేదా అతిథుల నుండి కాని ఈ సేవకు ఎలాంటి ప్రతిఫలం పొందదని, పొందకూడదనే  కేవలం అల్లాహ్ తాలా యొక్క ప్రీతిని పొందాలనే భావనను తమ మనస్సులో కల్గించుకొని అతిథులకు సేవచేయవలెను.

అతిథులు ఒకవేళ ఆతిథ్యమిచ్చు వారిపై అవసరానికి మించి, తప్పుడు పద్దతిలో అవసరాలను తీర్చమని కోరినచో అనేక సమస్యలు తలెత్తుతాయి. కావున అతిథులు అవసరాన్ని మించి కోరికలు కోరవద్దు. ఒకవేళ అలా కోరకుండ ఉన్నప్పుడే ఆతిథ్యమిచ్చు వారు సౌలభ్యంగా ఉంటారు, ఎవరికైతే ఆతిథ్య బాధ్యతలను అప్పగించడం జరుగుతుందో వారు కూడ సౌలభ్యంగా ఉంటారు.

మరల నేను తెలియజేయునదేమనగా, ఈ రోజులలో ప్రత్యేకించి దుఆలు మరియు ప్రార్థనల వైపు ప్రత్యేకమైన శ్రద్ధను కనబర్చండి. జమాఅత్ ప్రగతి కొరకు, శత్రువుల నుండి కాపాడబడుటకు దుఆలు చేయండి. జైళ్ళలో ఉన్నటు వంటి దైవ మార్గపు ఖైదీల విడుదల కోసం దుఆలు చేయండి.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 05 ఆగష్టు  2022, (05 జహూర్ 1401 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّينِ ۔

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ۔

صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ۔

అల్లాహ్ తాలా అనుగ్రహం వలన 2019వ సంవత్సరం తరువాత ఈ సంవత్సరం జల్సా సాలాన  ఇంగ్లాండ్ పెద్ద ఎత్తున నిర్వహించబడుచున్నది. గత సంవత్సరం కూడ జల్సాను నిర్వహించాము. కాని పరిమిత సంఖ్యలో నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం నిర్వహించు ఈ జల్సా కూడ నిజానికి కేవలం ఇంగ్లాండ్ దేశ జమాఅత్‌ల వరకే పరిమితం చేయబడింది. కాని విదేశాల నుండి కూడ పరిమిత సంఖ్యలో పాల్గొనుటకు వస్తున్నారు. అయినా కూడ ఈ మూడు రోజులు ఇంగ్లాండ్‌కు చెందిన జమాఅత్ సభ్యులందరు పాల్గొనుటకు అనుమతి గలదు. ఇన్షా అల్లాహ్ అనుమతించబడును. ఇన్షా అల్లాహ్ తాలా అధిక సంఖ్యలో జమాఅత్ సభ్యులు పాల్గొంటారని ఆశిస్తున్నాము.

మన అందరికి తెలిసిన విషయమేమనగా, క్రమంగా కొనసాగుతున్న మన జల్సాల పరంపరను కోవిడ్ కారణంగా ఒక సంవత్సరం పూర్తిగా నిలిపివేయవలసి వచ్చింది. ఫలితముగా జల్సా శుభముల నుండి మనం యధావిదిగా ప్రయోజనాలను పొందలేక పోయాము.  ఈ సంవత్సరం కూడ ఈ మహామ్మారి తగ్గుతూ, పెరుగుతూ ఉంది.  నేటి ఇది పూర్తిగా అంతరించిపోలేదు. కొన్ని ప్రాంతాలలో, ఇక్కడ కూడ , ప్రపంచపు ఇతర దేశాలలో కూడ కొన్ని రోజుల క్రితం ఈ మహామ్మారి విజృంభించ సాగింది. కాని అధిక సంఖ్యలో ఏకమయ్యే ఆంశంలో ఉన్నటు వంటి నిబంధనను ప్రభుత్వం ఈ రోజులలో అమలు చేయించడంలేదు. అంతమాత్రమున మనం ఎలాంటి ముందు జాగ్రతలను పాటించకూడదని దీని అర్థం కాదు.

అన్ని ముందుజాగ్రతలను సభలో పాల్గొను సభ్యులందరు గుర్తుంచుకొని వాటిని తప్పకుండా పాటించవలెను.

మనం తీసుకోవలసిన జాగ్రతలలో మొదటి జాగ్రత ఏమిటనగా, జల్సా ప్రాంగణంలో కూర్చునే ప్రతి సభ్యుడు. అదే విధముగా డ్యూటీలు ఇచ్చే వారు డ్యూటీలో ఉన్నప్పుడు, అదే విధముగా బయట తిరుగుతున్నప్పుడు అందరు తప్పకుండా మాస్కులను ధరించవలెను. అదే విధముగా ఈ సంవత్సరం నిర్వాహకులు ఈ మహామ్మారి నుండి కాపాడబడుటకు ప్రయోజన కరంగా భావించునట్టి హెూమియోపతి మందులను ఉదయం వేళ సభలో పాల్గొనేటప్పుడు మరియు సాయంత్రం వేళ తిరిగి వెళ్ళేటప్పుడు  అందరికి ఇస్తున్నారు. అల్లాహ్ తాలా వాటి ద్వారా స్వస్థతను చేకూర్చుగాకా!. మందుల ద్వారా స్వస్థతను కల్పించుట అల్లాహ్ పని. కాని మనం కూడ బాహ్యముగా తగు జాగ్రతలను పాటించాలి. ఈ ఆంశంలో జల్సాలో పాల్గొనేవారందరికి తెల్పునదేమనగా నిర్వాహకులకు సహకరించండి.

జల్సా నిర్వాహణలో ఉధ్యోగులు, సేవకులు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల కొరకు తమ సమయాన్ని త్యాగం చేస్తుంటారు. వారికి నేను సహజంగా జల్సాకు ఒక జుమా ముందు ప్రసంగంలో కొన్ని ఆంశాలను గూర్చి గుర్తుచేస్తుంటాను. కాని గత జుమా ప్రసంగంలో నేను వాటిని గుర్తుచేయలేక పోయాను. అందుకే  ఈ రోజు ఆ విషయాలను మీముందు వివరిస్తాను.  కొందరు బాలురు, కొందరు యువకులు మొదటిసారిగా ఢ్యూటీలు ఇచ్చుటకు వస్తుంటారు. కావున వారికి కూడ ఆ విషయాలు తెలుస్తాయి. గత మూడు సంవత్సరాలలో పాకిస్తాన్ నుండి ఇక్కడి చాలా మంది వచ్చారు. వారికి జల్సా ఢ్యూటీల పట్ల ఎలాంటి అవగాహన లేదు. అక్కడ జల్సాలు నిర్వహించక చాలా సంవత్సరాలు గడుస్తున్నాయి. కావున ఆయా ఆంశాల ప్రస్తావన వలన వారికి కూడ అవగాహన కల్గుతుంది. లేదా అవగాహనను పెంచుకుంటారు. అలాగే గత సేవకులకు, ఉధ్యోగులకు కూడ గుర్తుచేసినట్లు అవుతుంది. మొత్తానికి చాలా సంక్షిప్తముగా ఆయా ఆంశాలను ప్రస్తావించుతాను. ఆ తరువాత జల్సాలో పాల్గొను అతిథులను ఉద్దేశించి కూడ వారి బాధ్యతలను వారికి గుర్తుచేస్తాను. ఒకవేళ మనం ఈ ఆంశాలను దృష్టిలో పెట్టుకున్నట్లైయితే నిజమైన జల్సా వాతవరణంతో ఇన్షా అల్లాహ్ మనం తప్పకుండా ప్రయోజనాన్ని పొందుతూ ఉంటాము.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు. “ఈ జల్సా ప్రాపంచిక జాతర వంటిది కాదు. ”

వాస్తవానికి మనం అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలను వినడానికి, వాటికి అనుగుణంగా నడుచుకోవడానికి మనం ఇక్కడ ఏకమైతాము. ఏకమైనాము కూడ. అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స) బోధనలకు అనుగుణముగా మనం నడిచినప్పుడే  దేవుని హక్కులను మరియు అతని దాసుల హక్కులను చాలా గొప్పగా చెల్లించగలము. మొత్తానికి నేను ముందుగా తెల్పినట్లుగా  నేను మొదట సేవకులను ఉద్దేశించి కొన్ని విషయాలను ప్రస్తావించుతాను. మాస్కును ధరించాలని, మందులను వేసుకోవాలని నేను ముందే చెప్పాను కావున వాటిని తప్పకుండా పాటించండి. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన మన యువకులకు, పిల్లలకు, వృద్ధులకు,  మహిళలకు సేవచేయాలనే ఎంతో ఉత్సాహం ఉన్నది. అంతేగాకా జల్సాలో పాల్గొనే హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అతిథులకు సేవ చేయాలనే దృక్పథం, అందుకోసం తమను తాము అంకితం చేసుకోవాలనే అవగాహన, ఎంతో ఉన్నతముగా ఆతిథ్య మర్యాదలు చేయాలనే ఉత్సాహం కూడ ఉన్నది. సేవ చేయాలనుకునే వారు ఏ ఉధ్యోగం చేస్తున్నా, ఎంత గొప్ప కుటుంబాలకు చెందిన వారైన, సంపన్నులైన, పేదవారైన అందరు ఒకే ఆకాంక్షతో సేవలందిస్తుంటారు. జల్సా పనులు కేవలం జల్సా కొనసాగుతున్న మూడు రోజులలోనే కాకుండా, ఒక విధముగా చెప్పదలచినచో చాల వారముల ముందు నుండే కొనసాగుతుంటాయి. జల్సా పనులు ఏ విధముగా కొనసాగుతున్నాయి అని  ప్రస్తుతం ఎం.టి.ఏ వారు తమ వార్తలలో, చిన్న చిన్న క్లిప్స్ రూపంలో చూపిస్తున్నారు. కొన్ని పనులను నిస్సందేహముగా ఇతర కంపెనీలు మరియు గుత్తేదారుల ద్వారా చేయించడం జరుగుతుంది. ఆ పనులు కాకుండా ఇంకా చాలా పనులు కూడ ఉంటాయి. ఇందు కోసం కూడ శ్రామిక శక్తి చాలా అవసరం. ఈ శ్రామిక పనులను సభ్యులు స్వచ్ఛందముగా ముందుకు వచ్చి పూర్తి

చేస్తుంటారు. నేను ముందుగా తెల్పినట్లుగా అన్ని వర్గాల సభ్యులు ఈ కార్యక్రమాలలో పాల్గొంటు ఉంటారు.

స్వచ్ఛంధముగా సేవలందించు వారు ఎక్కడ దొరుకుతారు అని వారి కోసం ప్రపంచం ఎదురు చూస్తుంటుంది. కాని అహ్మదియ్య జమాఅత్ చరిత్ర ఇందుకు భిన్నమైన ఉదాహరణను చూపెడుతుంది. అనగా స్వచ్ఛంధ సేవకొరకు ఎంత మంది వస్తారనగా వారిని అదుపు చేయడం నిర్వాహకులకు కూడ కష్టతరం అవుతుంది.

జల్సా ఢ్యూటీల విషయంలో ప్రత్యేకముగా ఒక చార్ట్‌ను ఏర్పాటు చేస్తారు. ఒక కార్యక్రమము జరుగుతుంది. ప్రతిశాఖకు దాని అవసరానికి అనుగుణముగా తగిన సేవకులను నియమించుటకు ప్రయత్నిస్తుంటారు. కాని జల్సా కంటే ముందు కొనసాగు పనులను లేదా జల్సా తరువాత కొనసాగు పనులను మాత్రం శ్రమాదానం ద్వారనే పూర్తి చేస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని సార్లు ఊహించిన దాని కంటే ఎక్కువ ప్రజలు వస్తుంటారు. అందుకు కారణం కూడ అందరిని ఇందుకై ప్రోత్సహించడం. గత ఆదివారం ఎంత మంది స్వచ్ఛంద సేవకులు హదీఖతుల్ మహ్దిలో ఏకమయ్యారనగా, నిర్వాహకులకు కూడ అంతటి నమ్మకం లేకుండెను. వారందరికి సరిగా భోజన ఏర్పాట్లు కూడ చేయలేక పోయారనే విషయం కూడ నాకు తెలిసింది. నిజానికి నిర్వహాకులు అధిక సంఖ్యను చూసి అందుకు అనుగుణముగా తగిన ఏర్పాట్లు సమయానికి ముందు కూడ చేయవచ్చును. ఇది ఆతిథ్య శాఖకు చెందిన బాధ్యత. ఈ స్వచ్ఛంద సేవకులు కేవలం భోజన సమయంలో వచ్చినవారు కదుకదా!. ఉదయం నుండి వారు సేవలందిస్తున్నారు. లేదా ఉదయం నుండే వారు అక్కడ ఉన్నారు. నాకు తెలిసినంత వరకు గత జుమా ప్రసంగం చివరలో నేను జల్సా విజయం కోసం దుఆలు చేయమని, సేవలందించు వారి కొరకు దుఆలు చేయండి అని పిలుపునిచ్చినప్పుడు వెంటనే ఒక ఉత్సాహంతో ప్రజలందరు ముందుకు వచ్చారు. తమ సేవలనందించారు. కావున ఇలాంటి సమయంలో నిర్వాహకులు ప్రత్యేకించి వారం చివరిలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలి. ఆతిథ్య శాఖ వారు ఇక ముందు ఈ విషయాన్ని వ్రాసి పెట్టుకోవాలి.

అదే విధముగా ఆతిథ్య శాఖకు ఉన్నటు వంటిమరొక బాధ్యత ఏమిటనగా, జల్సా రోజులలో సాధారణముగా కొంచం ఎక్కువ మోతాదులో భోజనాన్ని వండుకోవాలి. ఈ సంవత్సరం జల్సా నిర్వహించబడుతుంది. కావున ఇప్పటి వరకు ఒక స్పష్టమైన కరత కొరవడినందున ఈ మహామ్మారి వలన కొందరు రావచ్చును, రాకపోవచ్చును. కొందరు చాలా రోజుల తరువాత జల్సా నిర్వహించబడుతుంది కావున రావాలని కొందరు వస్తుంటారు. కావున సాధారణంగా మన నిర్వహాకులు ప్రత్యేకించి భోజనం తయారు చేయువారు, ఆతిథ్యం కోసం ఖర్చు చేస్తున్నప్పుడు ఎక్కువ మోతాదులో వంటలు వండించడానికి బదులుగా తక్కువ మోతాదులో వంటలు వండిస్తుంటారు. తక్కువ సంఖ్యలో ప్రజలు వస్తారని భావించి తక్కువ మోతాదులో వంటలు వండిస్తుంటారు. ఇది సరికాదు.

జల్సాలో పాల్గొనుటకు వచ్చునట్టి అతిథులకు పూర్తి స్థాయిలో ఆతిథ్య మర్యాదలు చేయడం ఆతిథ్య శాఖ బాధ్యత.

అదే విధముగా వంటల విషయానికి వచ్చినచో మరొక గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా ప్రస్తుతం ఇవి వేసవి రోజులు. కావున ఆతిథ్య శాఖవారు మాంసాన్ని కోసిన వెంటనే కొద్ది కొద్ది మాంసాన్ని వెంటనే తీసుకొని వంటశాలకు తరలించి వంటలు వండడం మొదలు పెట్టాలి. అంతేగాని ఒక్కసారిగా తీసుకవెళు ్ళ తామని రోజంతయు అక్కడే ఉంచినచో మాంసం వాసన వస్తుంది. ఆ తరువాత ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. అదే విధముగా ఇతర వంటకాల విషయంలో కూడ తగిన జాగ్రతలు తీసుకోవాలి. మొత్తానికి స్వచ్ఛందగా సేవలందించుటకు వచ్చినవారికి నేను ముందుగా తెల్పినట్లుగా వారు సేవ చేయడానికి వస్తారు. కావున వారికి భోజనం పెట్టిన పెట్టకపోయినా వారు మౌనంగా వెళ్ళిపోయారు. కాని దీని ద్వారా నిర్వాహణ పరమైన ఒక లోపం బయటపడింది.

సేవకులకు కూడ ఈ సందర్భముగా తెలియజేయునదేమనగా, జల్సా కు చెందిన ఈ మూడు రోజులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథులకు సేవచేయుచున్నప్పుడు మేము మా అధికారుల నుండి గాని, లేదా అతిథుల నుండి కాని ఈ సేవకు ఎలాంటి ప్రతిఫలం పొందదని, పొందకూడదనే కేవలం అల్లాహ్ తాలా యొక్క ప్రీతిని పొందాలనే భావనను తమ మనస్సులో కల్గించుకొని అతిథులకు సేవచేయవలెను. అంతేగాకా తమ పిల్లలను ఆకలితో పడుకోబెట్టి, తాము ఆకలితో పడుకొని, వచ్చిన అతిథికి ఆతిథ్యం ఇచ్చిన ఆ అనుచరుడిని మరియు అతని భార్య యొక్క ఉదాహరణను ఎల్లప్పుడు దృష్టియందుంచుకోవాలి. వారు అతిథి ముందు దీపపు వెలుగును పెంచేక్రమంలో దీపాన్ని ఆర్పి, అతిథితో కలిసి భోజనం చేస్తున్నట్లుగా వ్యవహరించారు. అల్లాహ్ తాలా వారి ఈ ఆతిథ్యాన్ని ఎంతగా కొనియాడాడు అనగా దానిని గూర్చి ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు కూడ తెలిపాడు. మరుసటి రోజు ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ అనుచరుడితో మీరు రాత్రి వ్యవహరించిన విధానంను చూసి అనగా ఆ అతిథికి మీరు భోజనం తినిపించిన విధానాన్ని చూసి ముసల్మానుడి విధానంను చూసి అల్లాహ్ తాలా కూడ నవ్వుకున్నాడు అని తెలిపారు. మీ విధానంను చూసి అల్లాహ్ తాలా చాలా సంతోషించాడు. నవ్వుకున్నాడు. ఖుర్‌ఆన్ కరీంలో కూడ అల్లాహ్ తాలా ఇలాంటి త్యాగమూర్తులను గూర్చి ప్రస్తావించాడు.

ఇలాంటి త్యాగమూర్తులు నిస్వార్థమనస్సుతో త్యాగాన్ని చేశారు. ఇలాంటి వారే చివరికి విజయాన్ని పొందుతారు. (సహి బుఖారి, కితాబుల్ మనాకిబుల్ అన్సార్, బాబ్ ఖౌలుల్లాహ్ వ యూఅసరూన్ అల అన్ఫుసిహిం..... హదీస్ 3798)

అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం మరియు సేవలు చేయడం వంటి ఈ విధానాలను అనుచరులు అమలుపరిచారు.

అల్లాహ్ తాలా ప్రీతిని పొందడం కోసం అతిథుల హక్కులను చెల్లించుటకు ప్రయత్నించువారు ఎంతటి ఆదృష్టవంతులు. ఈ అతిథులు కూడ ఈ కాలపు ఇమాం పిలవడంతో వచ్చారు. అల్లాహ్ తాలా మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలను వినడానికి, నేర్చుకోవడానికి వచ్చారు. అల్లాహ్ తాలా ప్రీతిని పొందాలనే ఆకాంక్షతో వచ్చారు.

కావున ధర్మం కొరకు రాబోవు అతిథులకు సేవలందిస్తూ అల్లాహ్ ప్రీతిని పొందుటకు ప్రయత్నించు స్వచ్ఛంద సేవకులు ఎంతో అదృష్టవంతులు.

అధిక సంఖ్యలో అతిథులు పాల్గొన్నప్పుడు విభిన్న స్వభావాలు కల్గిన వారు కూడ ఉంటారు. కొందరు చాలా ఆవేశపరులు కూడ ఉంటారు, కొందరు కఠినముగా సేవకులతో వ్యవహరించవచ్చును. లేదా ఏదేని వస్తువు కావాలని పట్టుబట్టవచ్చును. కాని సేవకులు మాత్రం పురుష సేవకులైన, మహిళ సేవకులైన ఎవరైన సరే ఎవరితో కఠినముగా వ్యవహరించకూడదు. కఠినంగా ఎవరు మాట్లాడినా కూడ మీరు మాత్రం కఠినముగా సమాధానం ఇవ్వకూడదు. మీరు నవ్వుకుంటూ సమాధానం ఇవ్వాలి. ఒకవేళ వారికి వెసులుబాటు కల్పించ గలిగినచో తప్పకుండా కల్పించండి. లేనిచో మృదువుగా మాట్లాడండి. ప్రేమా సమకూర్చలేము అని చెప్పండి. లేదా మీ అధికారి వద్దకు తీసుకవెళ్ళండి. వారే అతిథుల సమస్యలను తీర్చెదరు. కొన్ని సార్లు ఈ బాధ్యత చాలా భారంగా ఉంటుంది. కాని దేవుని ప్రీతిని పొందడం కోసం ఈ పనిని కూడ సంతోషంగా చేయాలి. తమ మనోభావాలను, తమ నోటి వాక్కును అదుపు తప్పకుండా చూసుకోవాలి. అదే విధముగా సేవకులు కూడ పరస్పరం మాట్లాడుకుంటున్నప్పుడు మర్యాదపూర్వకంగా మాట్లాడుకోవాలి. అధికారులు, పర్యవేక్షకులు కూడ తమ సేవకులతో సున్నితముగా మాట్లాడాలి. ఒకవేళ ఎవరితోనైన ఏదైన పొరపాటు జరిగినచో ప్రేమతో నచ్చజెప్పండి. అధికారులు కూడ ఈ సేవకులు అల్లాహ్ ప్రీతిని పొందడం కోసం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథులకు సేవలు చేస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారిని ప్రోత్సహిస్తున్నట్లుగా, వారిని గౌరవించుతున్నట్లుగా వ్యవహరించాలి. వారికి ఆయా శాఖలో అనుభవం లేకపోయినా కూడ వారు సేవాదృక్పథంతో నిస్వార్థముగా ముందుకు వచ్చారు. కావున వారి గౌరవమర్యాదలను కూడ దృష్టియందుంచుకోవాలి. పరస్పరం కలసి మెలసి పనిచేయు భాగ్యం కూడ మీ అందరికి అల్లాహ్ తాలా అనుగ్రహించు గాకా!. మనం త్యాగ స్పూర్తితో ఈ సేవ చేస్తున్నాము అనే ఆలోచన కల్గినప్పుడే అధికారులకు, సేవకులకు ఆతిథ్య వాస్తవికత అర్థమవుతుంది. అతిథుల చెడు చేష్టల సమయంలో కూడ ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి సేవ చేశారు? అని మనం చూసినచో మనకు ఒక కథనము లభిస్తుంది. ఒక ముస్లిమేతర వ్యక్తి అతిథుడుగా వచ్చాడు. అతనికి భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పడుకోవడానికి అతనికి రాత్రి వేళ దుప్పటిని కూడ ఇవ్వడం జరిగింది. కాని రాత్రివేళ ఎక్కువగా తినడం వలన లేదా మరేదైన కారణం వలన గాని లేదా ఉద్దేశపూర్వకంగానే ఇబ్బంది పెట్టుటకు ఆ దుప్పటిపై విసర్జించి ఉదయం వేళ వెళ్ళిపోయాడు. అతని ఇట్టి పనిని ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చెడుగా భావించలేదు. పైగా మంచి నీటిని తెప్పించి స్వయముగా హుజూర్ (స) ఆ దుప్పటిని ఉతికి ఆరేసినారు. అనుచరులు హుజూర్ (స) తో అనుచరులం మేము ఉన్నాము కదా! మీరు ఎందుకు ఉతుకుతున్నారు? మాకు ఇవ్వండి అని అడిగినా కూడ హుజూర్ (స) మాత్రం అతడు నా అతిథుడు. కావున నేనే స్వయముగా ఈ పనిని చేస్తాను అని సమాధానం ఇచ్చారు. (మల్ఫూజాత్ సంపుటి 5, పుట 295, ఎడిషన్ 1984)(మస్నవీ మౌల్వీ మఅన్వీ దఫ్తర్ 5, పుట 20-25) హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా

తెలిపారు. ఎవరైతే అల్లాహ్ మరియు ప్రళయదినమును విశ్వసించుతారో వారు తమ అతిథులకు గౌరవిస్తారు. (సహి బుఖారి, కితాబుల్ అదబ; బాబ్ మన్ కాన యూమినూ బిల్లాహి..... హదీస్ 6018)

కావున మన స్వచ్ఛంద సేవకులందరు, బాధ్యత కల్గిన స్త్రీ, పురుషులు, అధికారులు, ఉపాధికారులు అందరి బాధ్యత ఏమిటనగా, ధర్మంను నేర్చుకోవడం కోసం వచ్చిన అతిథులను, అది కూడ హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అతిథులు. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పిలుపు మేరకు వస్తున్నటు వంటి అతిథులు. కావున మనం త్యాగం చేసైన వారికి సేవలు చేయాలి. ఎల్లప్పుడు అచంచల మనోధైర్యాన్ని ప్రదర్శించాలి. చిరునవ్వు ముఖంతో ఎలాంటి అయిష్టత కనిపించని ముఖంతో సేవ చేయండి. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఇలాంటి సేవా దృక్పథం మన సేవకులలో అధికులకు గలదు. ఈ దృక్పథంతోనే సేవకులందరు సేవలు చేస్తారని నేను భావిస్తున్నాను. వివిధ శాఖలకు నియమించబడిన అధికారులు కూడ ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన దేమనగా, అల్లాహ్ తాలా అనుగ్రహం వలనే వారికి సేవ చేయు భాగ్యం లభిస్తుంది. కావున వారు అధికారులుగా కాకుండా ఒక సేవకుడిగా తమను తాము భావించు కుంటూ సేవలందించవలెను. ఉన్నతమైన లక్షణాలతో నడుచుకోవలెను. అప్పుడే వారి క్రింద పని చేయువారు, ఇతర సేవకులు కూడ వారి ఉన్నతమైన లక్షణాలతో నడుచుకుంటారు. అల్లాహ్ తాలా అందరికి ఇలాంటి భాగ్యాన్ని కల్పించుగాకా!.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథులలో మర్యాదగా ప్రవర్తించాలి అనే అంశంపై అనేక సందర్భాలలో హితోపదేశాలు చేశారు. ఒకానొక సందర్భములో ఇలా తెలిపారు: చూడండి! చాలా మంది అతిథులు వచ్చారు. వారిలో కొందరు మీకు తెలిసినవారై ఉండవచ్చును మరికొందరు తెలవని వారై ఉండవచ్చును. అందుకే అందరిని గౌరవిస్తూ ఒకే విధముగా చూడాలి. అందరికి ఒకే విధమైన ఆతిథ్యాన్ని అందించాలి. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 226) ఈ హితోపదేశాన్ని ప్రతి సేవకుడు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. మరియు ప్రత్యేకించి అతిథులతో నేరుగా సంప్రదింపులు జరుపు సేవకులు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ఆతిథ్య శాఖలో పని చేయు సేవకులు, భోజనాలను వడ్డించు సేవకులు మాత్రం ఇంకా బాగా గుర్తుంచుకోవాలి.

ఈ సంవత్సరం కోవిడ్ వలన ఇంకా చాలా జాగ్రతలను పాటించాలి. అందుకే ఈ విషయంలో కూడ తగిన ఏర్పాట్లు చేయాలి. బహుశా నాకు తెలిసినంత వరకు ఆతిథ్య శాఖ ఏర్పాట్లు కూడ చేసింది. కావున భోజన సమయంలో ఎక్కువ రద్దీగా ఉండకూడదు. భోజనం తరువాత ఎక్కువసేపు అక్కడే కూర్చొని ఉండకూడదు. భోజనం చేసిన వెంటనే అక్కడి నుండి బయటికి వచ్చేయాలి. అతిథులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. నిర్వాహకులకు సహకరించాలి. భోజనం చేస్తున్నప్పుడు అక్కడే ఉండవలసి ఉంటుంది. నేను ముందుగా తెల్పినట్లుగా సాధారణ స్థితిలో అందరు మాస్కును ధరించండి. భోజనం చేస్తున్నప్పుడు తక్కువగా మాట్లాడండి. మాట్లాడకుండా భోజనం చేయుటకు ప్రయత్నించండి. త్వరత్వరగా భోజనం చేయండి. మీరు ఇబ్బంది పడవద్దు, ఇతరులను ఇబ్బందికి గురి చేయవద్దు.

సేవకులను ఉద్దేశించి నేను కొన్ని ప్రాథమిక విషయాలను తెలిపాను. వారిని అతిథుల సేవ కొరకు ప్రోత్సహించాను.

ఇప్పుడు అతిథులు కూడ కొన్ని విషయాలను వినండి: ఒకవేళ అతిథులు ఈ విషయాలను అనగా ఇస్లామీయ బోధనలతో కూడిన వీటిని అర్థం చేసుకున్నచో, వాటిని అనుసరించినచో ప్రేమానురాగాలతో కూడిన వాతవరణం నెలకొల్పును. ఆ బోధనలేమనగా అతిథులు ఆతిథ్యమిచ్చువారిపై అసాధారణముగా , అనవసరముగా భారం కాకూడదు.

అతిథులు ఒకవేళ ఆతిథ్యమిచ్చు వారిపై అవసరానికి మించి, తప్పుడు పద్దతిలో అవసరాలను తీర్చమని కోరినచో అనేక సమస్యలు తలెత్తుతాయి. కావున అతిథులు అవసరాన్ని మించి కోరికలు కోరవద్దు. ఒకవేళ అలా కోరకుండ ఉన్నప్పుడే ఆతిథ్యమిచ్చు వారు సౌలభ్యంగా ఉంటారు, ఎవరికైతే ఆతిథ్య బాధ్యతలను అప్పగించడం జరుగుతుందో వారు కూడ సౌలభ్యంగా ఉంటారు. కావున ఈ విషయాన్ని ఎల్లప్పుడు అతిథులు గుర్తుంచుకోవాలి. జమాఅత్ పరంగా ఏర్పాటు చేసిన ఆతిథ్య గృహాలలో ఉండే అతిథులు కూడ తమ సేవకుల పట్ల కృతజ్ఞత భావంతో వ్యవహరించాలి. ఎందుకనగా వారి అహ్మదీ సోదర సోదరీమణులు మంచి స్థాయిలో ఉన్నప్పటికి కూడ వారు తమను తాము అతిథులు సేవచేయుటకు అంకితం చేసుకున్నారు. కొన్ని సందర్భాలలో అతిథుల అభిరుచి మేరకు వంటలు ఉండవు. జమాఅత్ సాంప్రదాయం ప్రతి అహ్మదీయుడికి తెలిసే ఉంటుంది. జల్సా రోజులలో సాధారణంగా ఆలుగడ్డ మరియు మాంసం, పప్పు కూరలను వండడం జరుగుతుంది. కావున అతిథుల అభిరుచి మెరకు వంటలు లేకున్నప్పటికి అతిథులు వారికి వడ్డించే వంటలను సంతోషంగా భుజించవలెను.

ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అతిథులకు ఆతిథ్యమిచ్చు వారు ఏ వంటలతో భోజనాన్ని ఏర్పాటు చేసిన కూడ వాటిని సంతోషంగా భుజించవలెను. (ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 5, పుట 204, హదీస్ 15048, ప్రచురణ ఆలముల్ కుతుబ్ బెహ్రూత్ 1998)

గత సంవత్సరం వరకు ఒకవేళ ఎవరికైన లంగర్ ఖాన నుండి వడ్డించిన వంటలు నచ్చకపోయినచో జల్సా ప్రాంతం బయట ఏర్పాటు చేసిన దుకాణాలలో వారికి నచ్చిన భోజనం తినేవారు. కాని ఈ సంవత్సరం ఆ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. కావున ఈ వంటలకు భిన్నమైన అభిరుచి గలవారు కూడ అల్లాహ్ తాలా ప్రీతి కొరకు వడ్డించిన దానిని తినుటకు ప్రయత్నించగలరు. కాని ఆతిథ్య మిచ్చు వారు కూడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, వారు రుచికరమైన వంటలను వండుటకు ప్రయత్నించగలరు. రుచికరమైన వంటలను కోరుకునే వారు కొంత మందే ఉంటారు. కాని ఆ కొందరితోనే కొన్ని సందర్భాలలో సమస్యలు తలెత్తుతాయి. కేవలం సేవకులు ఉత్తమ సుగుణాలను ప్రదర్శించడం కాదు. జల్సా పాల్గొను అతిథులు కూడ ఉత్తమ సుగుణాలను ప్రదర్శించాలి. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జల్సాలో పాల్గొనువారిని గూర్చి ఈ విధముగా తెలిపారు: ఉత్తమ లక్షణాలను ప్రదర్శించండి. ఒకరు మరొకరిని గూర్చి ఆలోచించండి.

(షహాదతుల్ ఖుర్ఆన్, రూహాని ఖజాయిన్ సంపుటి 6, పుట 394)

జల్సాలో పాల్గొను వారు ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేనగా, తమ ఆధ్యాత్మిక, విజ్ఞాన, ధార్మిక లోటును పూర్తి చేసుకోవాలనే ఉద్దేశంతోనే జల్సాలో పాల్గొనాలి. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఈ వాక్యము అనగా "ఈ జల్సా కేవలం అల్లాహ్ ప్రీతికరమైన జల్సా" ను ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. అందుకే చిన్న చిన్న విషయాలను గూర్చి కోపతాపాలు, అసహనాలు వంటి వాటిని ప్రదర్శించకూడదు. సేవకులు కూడ మానవులే. ఒకవేళ వారితో ఏదైన తప్పిదం జరిగినచో చూసి చూడనట్లుగా వదిలి వేయండి. తమ గుణగణాలను సవరించుకొనుటకు ఇది చాలా చక్కనైన అవకాశం. కొన్ని సందర్భాలలో ఇరుపక్షాలలో ఎవరో ఒకరి వైపు నుండి అతిథుల నుండి గాని, లేక సేవకుల నుండి గాని ఎదుటివారికి కోపం వచ్చునట్లుగా నడుచుకోవడం జరుగుతుంది. కాని వాటిని చూసి చూడనట్లుగా వదిలి వేయడం, ఆ చోటు నుండి మరొక చోటికి వెళ్ళిపోవడం, గొడవ పెరుగకుండ చూసుకోవడం వంటివి ఉత్తమ గుణగణాలు అనుపించుకుంటాయి. కొన్ని సందర్భాలలో నవయువకులలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతాయి. కావున వారు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, మనం ఏ ఉద్దేశంతో ఇక్కడ ఏకమయ్యామో ఆ ఉద్దేశాన్ని పొందడమే చాలా ముఖ్యం.

తమ ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చుకోవడం, తమ ధార్మిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే ఉద్దేశం కావలెను. దేవుని హక్కులను, దేవుని దాసుల హక్కులను చెల్లించు విధానాలను నేర్చుకోవడం ఉద్దేశం కావలెను. కావున వాటిని నేర్చుకోవడం కోసం తమ ఆవేశాలను, ఉద్రేకాలను త్యాగం చేయవలసి ఉంటుంది. దుఆల ద్వారా అల్లాహ్ తాలాను సహాయం అడుగవలసి ఉంటుంది. ఈ విధమైన ఆలోచనలు కల్గినప్పుడే, నాలుకలు దైవ స్మరణను ఉచ్చరించుటకు శ్రద్ధను చూపినప్పుడే, ఇస్తిగ్ఫార్ మరియు తౌబల వైపు ఆసక్తి పెరిగినప్పుడే, ఏదైన ఇబ్బంది ఎదురైనప్పుడు క్షమించడం, మన్నించడం అలవాటు చేసుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది. కావున ఈ రోజులలో మనం అల్లాహ్ ప్రీతి కొరకు మన గృహాలను వదిలి పెట్టి సుదూర ప్రయాణాలు చేసి వచ్చామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రయాణపు దుఆను నేర్పుతూ ఒకానొక సందర్భములో ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. ఓ అల్లాహ్! మేము నీనుండి ఈ ప్రయాణపు లాభాన్ని, ధార్మికతను యాచిస్తున్నాము. నీవే మాకు నీకు ఇష్టమైన సత్కార్యములను చేయునట్టి భాగ్యమును కల్పించుము అని నేర్పించారు. (సహి బుఖారి, కితాబుల్ హజ్, బాబ్ ఇస్తజాబు జికర్ ఇజా రకబ...... హదీస్ హదీస్ 3275)

మనం ఇలా దుఆ చేసినప్పుడు అల్లాహ్ తాలా మన బసచేయుటను, మన ప్రయాణంను శుభములతో నింపుతాడు. కావున ఈ రోజులను ప్రత్యేకించి దుఆలు మరియు దైవ స్మరణలతో అధికముగా నింపుకొనుటకు ప్రయత్నించవలెను.

ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకు అన్ని సందర్భాలకు చెందిన దుఆలను నేర్పించారు. కొందరు తమ గృహాలను వీడి జల్సా శుభములను పొందుటకు జల్సాకు వచ్చారు. వారికి వారి కుటుంబ సభ్యుల చింతన కూడ ఉ

ంటుంది. అందుకే అలాంటి వారి కొరకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ దుఆను కూడ నేర్పించారు. ఓ మా అల్లాహ్! ప్రయాణపు కష్టాల నుండి, అయిష్టతల నుండి, కలిచివేయునట్టి దృశ్యాల నుండి, సంపద మరియు కుటుంబ సభ్యులకు ఏదేని ఆపద కల్గుట నుండి, అయిష్టపరమైన మార్పుల నుండి నీ శరణు వేడుకుంటున్నాను.

(సహి ముస్లిం, కితాబుల్ హజ్, బాబ్ ఇస్తజాబు జికర్ ఇజా రకబ... హదీస్ 3275)

ఇది చాలా గొప్ప సంక్షిప్త దుఆ. ప్రయాణంలో తమను తాము అన్ని రకాలుగా సురక్షితముగా ఉంచుకొను దుఆ. కుటుంబీకుల కొరకు అల్లాహ్ తాలా అభయాన్ని ఆకాంక్షించు దుఆ. ఇలాంటి ఆలోచనలు, ఇలాంటి దుఆలతో నాలుకలను స్మరింపజేయాలి. ఇట్టి స్మరణలతో స్త్రీ, పురుషులు తిరుగుచున్న చోటు కూడ ప్రశాంతమైన చోటుగా మారుతుంది. మనస్సుకు సంతృప్తి కల్గుతుంది. అంతేగాకా అల్లాహ్ తాలా అన్ని చెడు దృశ్యాల నుండి కాపాడుతాడు.

నేడు కోవిడ్ వలన కూడ చింతనతో ఉన్నారు. దుఆల వైపు చాలా శ్రద్ధను కనబర్చాలి. అల్లాహ్ తాలా జల్సాలో పాల్గొనువారిని కూడ సురక్షితముగా కాపాడు గాకా!, గృహాలలో ఉన్నవారిని కూడ సురక్షితముగా కాపాడుగాకా!, మొత్తానికి సాధారణ దుఆలతో పాటు దరూద్ షరీఫ్‌ను కూడ అధికముగా పఠించవలెను.

అదే విధముగా నమాజ్‌ల సమయానికి నమాజ్ సల్పుటకు రండి. బయట మాటలతో సమయాన్ని వృధా చేసుకోకండి. అదే విధముగా ఢ్యూటీలు లేని సేవకులు కూడ నమాజ్ సమయానికి నమాజ్ సల్పుటకు రండి. సామూహికముగా నమాజ్ సల్పుటకు ప్రయత్నించండి. అదే విధముగా జల్సాలో పాల్గొను వారందరు జల్సా కార్యక్రమాలను జల్సా ప్రాంగణంలోనే కూర్చొని చూడడానికి ప్రయత్నించండి.

వక్తలు ఎంతో శ్రమించి ఉపన్యాసాలను తయారు చేసుకుంటారు. వాటి ద్వారా విజ్ఞాన, ఆధ్యాత్మిక లాభాలు చేకూరుతాయి. అందుకే ఎవరి ఉపన్యాసం బాగుంటుంది, ఎవరు మంచిగా ఉపన్యాసం చేస్తారు అని చూడకుండా, ఉపన్యాసంలో పేర్కొనబడిన అంశం ఏమిటి?. దాని ద్వార ఎంత ప్రయోజనం చేకూరుతుంది? అని మాత్రమే చూడండి. సాధారణముగా నేటి అవసరాలను దృష్టియందుంచుకొని ఉపన్యాసాలను సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఒకవేళ ఆయా ఉపన్యాసాలను శ్రద్ధగా విన్నట్లైయితే మనస్సులో తలెత్తు చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

అందుకని ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధతో కూర్చొని వినండి. నేను ముందుగా తెల్పినట్లుగా ఈ సంవత్సరం బజార్‌ను ఏర్పాటు చేయలేదు. కాని జల్సా కార్యక్రమాల మధ్యలో విరామం వచ్చినప్పుడు ప్రేక్షకుల కోసం అనేక రకాల ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంవత్సరం చిన్న స్థాయిలోనే ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్ళండి వాటిని సందర్శించండి. వాటి నుండి లాభాన్ని పొందండి. ఇన్షా అల్లాహ్ తాలా పరిస్థితులు చక్కబడిన తరువాత, ప్రదర్శన శాలలను కూడ విశృత స్థాయిలో ఏర్పాటు చేస్తారు. మిగిలిన వ్యవస్థలు కూడ అదే విధముగా కొనసాగుతుంటాయి. మరల గుర్తుంచుకోవలసిన విషయమేమనగా ఈ సంవత్సరం వర్షాలు సరిగా లేవు. అందుకే వాతవరణం పొడిగా ఉన్నది. కావున గత సంవత్సరాల వలే ఈ సంవత్సరం పార్కింగ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తవు అని నేను భావిస్తున్నాను. ఇన్షా అల్లాహ్. గత సంవత్సరాలలో వర్షాల కారణంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొన వలసి వచ్చింది. ఈ సంవత్సరం ఏర్పాట్లు కూడ చాలా బాగా చేశారు. ట్రక్ వంటి ఏర్పాట్లను బాగానే చేశారు. అంతేగాకుండా శాశ్వత ప్రణాళికలతో అనుభవజ్ఞులైన నీటి పారుదల శాఖ వారిని సంప్రదించి నీటిని బయటికి పంపే పటిష్టమైన విశృతమైన ఏర్పాట్లను చేయడమైనది. గత మాసంలో కురిసిన వర్షాలకు నీటిని మళ్ళించిన విధానాన్ని చూసినచో ఇన్షా అల్లాహ్ రాబోవు రోజులలో కూడ ఈ ప్రణాళిక చాలా ప్రయోజనాన్ని చేకూర్చుతుందని అనుకుంటున్నాము. మొత్తానికి ఈ సంవత్సరం ఈ రోజులలో వర్షారహిత వాతవరణం ఉంటుదని వాతవరణ శాఖ పేర్కొంది. కాని కారుల పార్కింగ్ విషయంలో కొన్ని సార్లు ఎక్కువ సంఖ్యలో కార్లు రావడం వలన కూడ నిర్వాహకులకు కొన్ని సమస్యలు ఎదురైతాయి. కాని కార్లలో ప్రయాణం చేసి వచ్చేవారు ఒకవేళ నిర్వాహకులకు సహకరించినచో చాల సులువుగా సమస్యలు మాయమై పోతుంటాయి. అందుకే సహనంతో కార్లలో వచ్చేవారు ట్రాఫిక్ వ్యవస్థలకు సహకరిస్తూ ఉండాలి. తద్వారా అన్ని రకాల సమస్యలు దూరమై పోతాయి.

అదే విధముగా నేను ప్రతి సంవత్సరం గుర్తుచేసినట్లుగానే మరల గుర్తు చేయునదేమనగా టాయిలెట్లు, బాతురూమ్‌లను ఉపయోగించువారు వాటిని శుభ్రముగా ఉంచుటకు ప్రయత్నించండి. ఈ సంవత్సరం ప్రత్యేకించి నీటిని వృధా చేయకండి. వర్షాలు తక్కువగా ఉన్నందున ప్రభుత్వం తక్కువ నీటిని ఉపయోగించాలని ఆదేశించింది. కావున చాలా జాగ్రతగా నీటిని వాడండి. అదే విధముగా ఎండు గడ్డికి చాలా తేలికగా నిప్పు అంటుకుంటుంది. కావున ఈ విషయంలో కూడ చాలా జాగ్రతలు వహించండి. ఎలాంటి నిర్లక్ష్యమైన చాలా పెద్ద ప్రమాదాన్ని సృష్టించవచ్చును. మనకు మన పొరుగువారికి కూడ నష్టాన్ని కల్గించవచ్చును. కావున చాలా జాగ్రతగా నడుచుకోగలరు. చుట్టు ప్రక్కల పరిసరాలపై దృష్టిని కేంద్రీకరించండి. అనుమానస్పద బ్యాగులను, వస్తువులను చూసినప్పుడు వెంటనే నిర్వాహకులకు సమాచారాన్ని అందజేయండి. నిర్వాహకులు మరియు స్కానింగ్ చేయువారు, కార్డు పరిశీలించువారు మాస్కును తీయించి ఇతడు కార్డులో ఉన్న వ్యక్తియేనా కాదా అని వారి ముఖాలను సరిగా చూడండి.

అల్లాహ్ తాలా అన్ని రకాల చెడుల నుండి అందరిని కాపాడుగాకా!, తన ప్రత్యేక శుభములను అవతరింపజేయును గాకా!.

మరల నేను తెలియజేయునదేమనగా, ఈ రోజులలో ప్రత్యేకించి దుఆలు మరియు ప్రార్థనల వైపు ప్రత్యేకమైన శ్రద్ధను కనబర్చండి. జమాఅత్ ప్రగతి కొరకు, శత్రువుల నుండి కాపాడబడుటకు దుఆలు చేయండి. జైళ్ళలో ఉన్నటు వంటి దైవ మార్గపు ఖైదీల విడుదల కోసం దుఆలు చేయండి. వారు జైళ్ళలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అల్లాహ్ తాలా వారిని త్వరగా విడుదల చేయు సామాగ్రిని సృష్టించుగాకా!. జుమా నమాజ్‌లలో మరియు జుమా నమాజ్‌ల తరువాత కూడ, ఇతర రోజులలో కూడ ప్రత్యేకించి దుఆలు చేయండి.

చివరలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు జల్సాలో పాల్గొను వారికోసం చేసిన దుఆలను నేను ఇప్పుడు ప్రస్తావించుతాను. వారు (అ) ఇలా దుఆ చేశారు: " ఈ దైవ జల్సా కొరకు ప్రయాణించు ప్రతి వ్యక్తికి అల్లాహ్ తాలా తోడుగా ఉండును గాకా!, వారికి చాలా ప్రతిఫలాన్ని అనుగ్రహించు గాకా!, వారిని కరుణించుగాకా!, వారి కష్టాలను, ఇబ్బందికర పరిస్థితులను వారి నుండి తొలగించుగాకా!, వారి బాధలను, వారి దు:ఖాలను దూరం చేయుగాకా!, ప్రతి సమస్య నుండి వారిని కాపాడుగాకా!, వారి కోరికలను నెరవేరునట్టి మార్గాలు వారిపై తెరువుగాకా!, ప్రళయదినమున తన దాసులతో వీరిని కూడ స్వీకరించుగాకా!, వారిపై తన దయానుగ్రహాలను కురిపించుగాకా!, వారి తిరుగు ప్రయాణంలో వారికి తోడుగా వారి ఖలీఫా ఉండుగాకా!. ఓ అల్లాహ్! ఓ మహిమాన్వితమయుడా! ఓ అనుగ్రహించువాడా! ఓ కరుణామయుడా! సమస్యలను తీర్చువాడా! మా దుఆలన్నింటిని స్వీకరించుము. మాకు మా వ్యతిరేకులపై స్పష్టమైన సంకేతాలతో విజయాన్ని ప్రసాదించుము. అన్ని రకాల శక్తులు, సామర్థ్యములు నీకే ఉన్నాయి. ఆమీన్." (మజ్మూఅ ఇష్తిహారాత్ సంపుటి 1, పుట 342)

జల్సాలో పాల్గొనే స్త్రీ పురుషులందరికి అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి దుఆలకు వారసులను చేయుగాకా!, కొందరు జల్సాలో పాల్గొనాలనే ఉద్దేశంతో విధేశాల నుండి కూడ వచ్చారు. కాని ఇక్కడికి చేరుకోవడంతో అనారోగ్యానికి గురైనారు. కొందరు పాల్గొనాలని చాలా ఆశించారు. కాని పాల్గొనలేక పోయారు. అల్లాహ్ తాలా వారికి కూడ వారి సంకల్పాల దృష్ట్యా ప్రతిఫలములను అనుగ్రహించుగాకా!, వారిని ఈ దుఆలకు వారసులను చేయుగాకా!.

---

(12వ పేజి తరువాత చదువుము)

మూడవ ప్రస్తావన ముష్తాఖ్ అహ్మద్ఆలం గారిది. వీరు ముకర్రం ముహమ్మద్ ఆలం గారి కుమారుడు. వీరు మేరాబడ్కా, మీర్‌పూర్ స్వతంత్ర కశ్మీర్‌కు చెందిన వారు. 19 జులై 2022న 60 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్ చేశారు. వారి జ్ఞాపకార్థం వారి భార్య అజ్మత్ బీబీతో పాటు 6గురు కుమారులు, 2 కుమార్తేలు ఉన్నారు. ముగ్గురు కుమారులు ఒక అల్లుడు ఖుర్ఆన్ ను కఠంస్తం చేశారు. ముగ్గురు కుమారులు మురబ్బీలు. వారిలో ఒకరు హాఫిజ్ ముసవ్విర్ అహ్మద్ ముజమ్మిల్ పశ్చిమ ఆఫ్రీకా సేనిగాల్‌లో ఉన్నారు. రెండవ కుమారుడు హాఫిజ్ ఇఖ్లాక్ అహ్మద్ గారు. మూడవ కుమారుడు అబ్దుల్ ఖాలిఖ్ గారు. వీరు ఆర్కేయాలజిలో ప్రావీణ్యతను నేర్చుకుంటున్నారు. అల్లాహ్ తాలా వీరందరికి కూడ సహనంను, ఓర్పును ప్రసాదించుగాకా!, మృతున్ని కరుణించుగాకా! నేను ముందుగా తెల్పినట్లుగా నమాజ్‌ల తరువాత వీరందరి పరోక్ష జనాజ నమాజ్‌ను చదువించుతాను.

సమాప్తం.

# జుమా ప్రసంగము

అల్లాహ్ తాలా అన్ని రకాల భయాందోళనలను దూరం చేసి శాంతియుత వాతవరణాన్ని నెలకొల్పినాడు.

అల్లాహ్ తాలా ప్రతి అహ్మదీయుని విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచుగాకా!, జల్సా ప్రభావాలను శాశ్వతముగా స్థిరపర్చుగాకా!.

జల్సా తయారి నుండి జల్సా ముగింపు వరకు నిస్వార్థముగా సేవలందించిన సేవకులందరికి నేను కృతజ్ఞతలు తెల్పుచున్నాను.

మేము ఎం.టి.ఏ కెమరా కన్నులతో ఒక ఐక్యతతో కూడిన దృశ్యాన్ని చూశాము. ఇది ఖచ్చితముగా అల్లాహ్ తాలా అనుగ్రహమే.

ఈ ప్రేమను అల్లాహ్ తాలాయే ప్రజల మనస్సులో సృష్టించాడు. ఎక్కడ చూసిన ఎలాంటి కల్పితం కనిపించలేదు.

నేడు నిజమైన ఇస్లాంకు అహ్మదియ్యతే ఒక గొప్ప నిదర్శనం. ప్రజలు ఈ వాస్తవాన్ని గ్రహించి తండోప తండాలుగా అహ్మదియ్యత్‌లో చేరు రోజులు దగ్గరిలోనే ఉన్నాయి.

మహిళలకు ఇస్లాం ధర్మం హక్కులను కల్పించినట్లుగా క్రైస్తవ ధర్మం కల్పించలేదని చెప్పడానికి నేను ఏ మాత్రం సిగ్గుపడను. (ఒక క్రైస్తవ ఫాద్రి అభిప్రాయం)

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన నిజమైన ఇస్లాంను బోధనలను నేడు అహ్మదియ్య జమాఅత్‌యే వ్యాప్తింప జేయడం నిజంగా ఇది అహ్మదియ్య జమాఅత్ గొప్ప ప్రత్యేకత.

ఖలీఫతుల్ మసీహ్ గారి ప్రసంగంలో ఖుర్ఆన్ సూక్తులు, ఆ౦ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, శాస్త్రబద్ధమైన ఆధారాలతో కూడి ఉన్నది.

ఇంగ్లాండ్ జల్సా సాలాన 2022ను పురస్కరించుకొని జల్సాలో పాల్గొన్న అహ్మదీయులు, అహ్మదీయేతరులు మరియు ముస్లిమేతరుల అభిప్రాయాలు.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 12 ఆగస్టు 2022, (12 జహూర్ 1401 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ప్రసంగం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

అల్ హందు లిల్లాహ్. అల్లాహ్ తాలా మనకు గత వారం జల్సా సాలాన ఇంగ్లాడ్‌ను నిర్వహించుకొను భాగ్యాన్ని కల్పించాడు. ఆ మూడు రోజులు మనం అల్లాహ్ తాలా యొక్క అసంఖ్యామైన అనుగ్రహాలను చూశాము. ఈ సంవత్సరం కూడ కోవిడ్ వ్యాప్తి వలన గత సంవత్సరం వలే చిన్న స్థాయిలోనే జల్సా నిర్వహించ వలసి ఉంటుందని భావించాము. కాని చివరి నెలలో ఇంగ్లాండ్‌కు చెందిన అహ్మదీయులందరికి జల్సాలో పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని నిర్ణయించాము. ఈ నిర్ణయంపై మొదట్లో జల్సా నిర్వాహకులు కొంత ఆందోళన చెందారు. కాని ఆ తరువాత వారు ఏర్పాట్లు ప్రారంభించారు. నేను ముందుగా తెల్పినట్లుగా అల్లాహ్ తాలా అనుగ్రహాలు వర్షించడను మనం చూశాము.

జల్సా కోసం చాలా ఎదురు చూస్తుంటారు. సంవత్సరం మొత్తం ఎదురు చూస్తుంటారు. చాలా ఏర్పాట్లను నిర్వాహకులు చేయవలసి ఉంటుంది. కాని జల్సా ప్రారంభం కాగానే ఆ మూడు రోజులు కన్ను రెప్పలు మూసి తెరిచేలోగా ఎలా గడిచిపోయాయో అర్థంకాని పరిస్థితి నెలకొంటుంది. ఈ సంవత్సరం ప్రజలు కూడ చాలా రకాలుగా ఆందోళనలో ఉన్నారు. కొందరు నాకు కూడ లేఖలు వ్రాసారు. చింతనను వెల్లడించారు. ప్రజలు కూడ స్వయముగా అధిక సంఖ్యలో దుఆలు చేయసాగారు. నేను కూడ దుఆలు చేశాను. జమాఅత్ సభ్యులు కూడ దుఆలు చేయసాగారు. మొత్తానికి అల్లాహ్ తాలా అన్ని రకాల భయాందోళనలను శాంతి సామరస్యతలుగా మార్చినాడు.

కోవిడ్ మహమ్మారి విస్తరిస్తుంది. ఇది కూడ ఒక కారణం. మొత్తానికి దాని ప్రభావం కూడ జల్సాలో పాల్గొన్నవారికి కొంత వరకు ఉండవచ్చును. కాని అల్లాహ్ తాలా అనుగ్రహం చాలా అధికముగా ఉన్నది.

మొత్తానికి ఇప్పుడు నేను జల్సాను గూర్చి కొన్ని విషయాలను ప్రస్తావించ దలిచాను. జల్సా తదుపరి వచ్చే జుమాలో సాధారణముగా నేను సేవకులకు కృతజ్ఞతలు తెల్పుతాను. అదే విధముగా జల్సా పాల్గొన్న అతిథుల అభిప్రాయాలను, జల్సా రోజులలో అల్లాహ్ తాలా కురిపించిన అనుగ్రహాలను గూర్చి ప్రస్తావించుతాను. ఈ క్రమంలో నేను ముందుగా సేవకులందరికి కృతజ్ఞతలు తెల్పుచున్నాను. వారందరు జల్సా ఏర్పాట్ల ప్రారంభం నుండి జల్సా ముగింపు ఏర్పాట్ల వరకు నిస్వార్థముగా సేవలందించారు. ఇప్పటికి వైడింగ్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఏదో ఒక రకముగా ఆ ముగింపు పనులు కొనసాగుతున్నాయి. జల్సా రోజులలో వివిధ శాఖలకు చెందిన సేవకులు, సేవకురాళ్ళు కూడ తమ తమ శక్తి సామర్థ్యములకు అనుగుణముగా చాలా బాగా పనులు చేశారు. అందువలన జల్సా పాల్గొన్న వారందరు కూడ వారికి కృతజ్ఞతలు తెలుపవలెను.

ఎవరితోనైన మీకు ఏ విధమైన సహాయం అందినా కూడ, మీకు ఏదైన పని ఎవరైన చేసిన పెట్టినా కూడ అతనికి కృతజ్ఞతలు తెలపాలి అనేది ఇస్లామీయ బోధనలు. దాసుల పట్ల కృతజ్ఞతతో ఉండడమే అల్లాహ్ తాలా పట్ల కృతజ్ఞతతో ఉండునట్టు చేయును. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు అందరు సేవల యొక్క హక్కులను చెల్లించుటకు ప్రయత్నించారు. కొన్ని లోపాలు, బలహీనతలు కూడ దృష్టికి వచ్చాయి. కాని ఇంత పెద్ద కార్యక్రమాలలో చిన్న చిన్న లోపాలు కూడ కనిపిస్తుంటాయి. కాని ఈ లోపాలను, బలహీనతలను దూరం చేయడం నిర్వాహకుల బాధ్యత. ఉదా॥ మహిళలకు భోజనం వడ్డించే ప్రాంగణంలో నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. లేదా కొన్ని ఇతర అంశాలకు చెందినవై ఉండవచ్చును. ఈ విషయంలో ప్రజల నుండి ఉత్తరాలు కూడ వచ్చాయి. వాటిని నేను వెను వెంటనే నిర్వాహకులకు పంపిస్తున్నాను. కావున వాటినన్నింటిని ఒక హెచ్చరిక పుస్తకములో పొందుపర్చుకున్నట్లైయితే వచ్చే సంవత్సరపు నిర్వాహణలో ఆయా శాఖలో ఇంకా మంచి ఏర్పాట్లు చేయుటకు ప్రయత్నించవచ్చును.

మొత్తానికి సేవకులందరు సాధారణముగా చాలా బాగా పని చేశారు. చాలా పని చేశారు. పిల్లలు కూడ తమ డ్యూటీల హక్కులను చెల్లించారు. మొత్తానికి వారందరికి కృతజ్ఞతలు తెల్పుచున్నాను.

ఎం.టి.ఏ కూడ చాలా మంచిగా ప్రసారాలను చేసింది. ఈ సంవత్సరం వారు స్టూడియోలో కూడ పనులన్ని వారే స్వయముగా చేసుకున్నారు. దీని వలన కొన్ని వేల పౌండ్లు మిగిలాయి. ఈ సంవత్సరం అనేక అభివృద్ధి చెందిన దేశాలు మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలను జల్సా కార్యాక్రమాల మధ్యలో కలపడం జరిగింది. ఫలితముగా ఇక్కడ కూర్చున్న ప్రజలు కూడ విదేశాలలో ఉంటున్న తమ సోదరులను చూశారు.

ఏం.టి.ఏ కేమరా దృష్టితో ఒక ఐక్యతను చూశాము. ఇది అల్లాహ్ తాలా యొక్క ప్రత్యేక అనుగ్రహం. ఎం.టి.ఏ సేవకులు జమాఅత్ అహ్మదియ్య ఐక్యతను ఎం.టి.ఏ ద్వారా ప్రపంచానికి చూపించి వ్యతిరేకుల నోటిని మూయించినందున వారు కూడ కృతజ్ఞతలకు అర్హులు.

మొత్తానికి ఇప్పుడు నేను కొందరు అహ్మదీయులు , అహ్మదీయేతరుల అభిప్రాయాలను మీ ముందు ప్రస్తావించుతాను. అల్లాహ్ తాలా అనుగ్రహాలను కూడ ప్రస్తావించుతాను. జల్సా ద్వారా అల్లాహ్ తాలా ఏ విధముగా ప్రపంచంలో ఇస్లాం సందేశాన్ని వ్యాపింపజేశాడో ఆ విషయాలను కూడ మీ ముందు ప్రస్తావించుతాను.

నైజీరియాకు చెందిన ఒక అహ్మదీయేతర మిత్రుడు అబూబకర్ సీని గారు ఉన్నారు. వీరు అహ్మదీయేతర ధార్మిక పండితుడు. నియామే నగరంలోని ఒక మస్జిద్‌కు ఇమాంగా కొనసాగుచున్నారు. వారు తమ అభిప్రాయాన్ని ఈ విధముగా తెలిపారు. ప్రజలకు వర్తమాన ఖలీఫాతో ఉన్నటు వంటి ప్రేమానురాగాలు నన్ను చాలా ప్రభావితున్ని చేసింది. వర్తమాన ఖలీఫా గారి ఒకే ఒక సూచనతో సంపూర్ణ విధేయతను ఎంతో గొప్పగా ప్రదర్శించసాగారు. ఉపన్యాసాల మధ్యలో పూర్తి నిశబ్దం. చలనమే లేదు. మరల ఇలా తెలిపారు. ఈ అభిమానాన్ని అల్లాహ్ తాలాయే ప్రజల గుండెలలో వేసినట్లుగా అనిపించసాగింది. ఎందుకనగా ఇందులో ఎలాంటి కల్పితం కనిపించలేదు.

మరల బుకీనాఫాసూకు చెందిన మరొక అహ్మదీయేత మిత్రుడు ఇష్‌హాఖ్ గారు ఇలా తమ అభిప్రాయాన్ని తెలిపారు: మీ వార్షిక జల్సా చాలా గొప్పగా కొనసాగింది. ఇందుకు ఉదాహరణయే కనిపించదు. ఇంత మంది ఒకచోట ఏకమైయ్యారు. ఇది ఒక అద్భుతం కంటే తక్కువేమి కాదు. ప్రజలు ఒకే ఇమాంను అనుసరిస్తున్నారు. ఈ జల్సా తనకు తానే ఒక ఆదర్శం. మరల ఇలా తెలిపారు. ఎవరు అంగీకరించినా అంగీకరించకున్నా నేడు నిజమైన ఇస్లాంకు రూపం అహ్మదియ్యత్‌యే. ఎక్కువ రోజులు గడవక ముందే ప్రజలు ఈ వాస్తవాన్ని గ్రహిస్తారు, ఈ జమాఅత్‌లో చేరుతారు.

ఇవి అహ్మదీయేత ముసల్మానుల అభిప్రాయాలు. అల్లాహ్ తాలాయే వారి మనస్సులు ఇటువైపు త్రిప్పుచున్నాడు.

మరల ఫ్రెంచ్ గయానలో ఒక సేరీన్‌కు చెందిన అహ్మదీయేతర మిత్రుడు ఉన్నాడు. మొదటి సారి వారు జల్సాలో పాల్గొన్నారు. అరబీ మాట్లాడేవారి కోసం మస్జిద్‌లో ఎం.టి.ఏ అల్ అరబియా ద్వారా జల్సా కార్యక్రమాలను చూసే ఏర్పాట్లు చేయడమైనది. వారు తమ అభిప్రాయాన్ని ఈ విధముగా తెలిపారు: నేను మొదటి సారిగా జమాఅత్ సందేశాన్ని వింటున్నాను. మొదటిసారిగా నేను మీ ఖలీఫా గారి ప్రసంగాన్ని విన్నాను. ఈ విధముగా ఇస్లాం సందేశాన్ని ప్రపంచానికి తెలియజేసే ఒక మాఅత్ ముసల్మానులలో ఉన్నదని తెలుసుకోని నేను చాలా ప్రభావితున్ని అయినాను. ఒక ఖలీఫా బైఅత్‌లో ప్రపంచం మొత్తం పని చేయుచున్నది. నేను కూడ ఇన్శా అల్లాహ్ మీ జమాఅత్‌ను గూర్చి తప్పకుండా అధ్యాయణం చేస్తాను. ఇంకా ఎక్కువగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను.

మరల ఫ్రెంచ్ గయానకు చెందిన మరొక అహ్మదీయేతర ముసల్మాను మిత్రుడు ఉన్నాడు. వారు కూడ జల్సా కార్యక్రమాలను వినడానికి వచ్చారు. వారు ఇలా తెలిపారు: జల్సా సాలాన యు.కే కార్యక్రమాలను నేను మొదటి సారిగా వీక్షించాను, విన్నాను. నేను చాలా ప్రభావితున్ని అయినాను. మీ జమాఅత్ అంతర్జాతీయ్య జమాఅత్. మరల ఇలా తెలిపారు: నేను వాస్తవానికి గని కనాకరీకి చెందినవాడిని. జల్సా కార్యక్రమాల మధ్యలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అనేక దేశాల ప్రజలు జల్సాలో పాల్గొనడాన్ని చూశాను. కాని గనీకనాకరీ ప్రజలు కనిపించలేదు. వారు ఎందుకు కనిపించలేదు అని ఆలోచిస్తుండగానే స్క్రీన్‌పై గనీ కనాకరీ జమాఅత్‌కు చెందిన వీడియో కనిపించింది. ఆ దేశంలో కూడ ఈ జమాఅత్ ఉన్నదని తెలుసుకోగా నాకు చాలా సంతోషం కల్గింది. మరల వారు ఇలా తెలిపారు: ఖలీఫా గారు మహిళల హక్కులను గూర్చి తెల్పినారు. వాటిని విన్న తరువాత నేను ఒక ముసల్మానుడిని అయినందుకు గర్వించసాగాను.

లైబీరియా నుండి ఒక ముస్లిమేతర అతిథి బాబ్ ఎం డోలో గారు పాల్గొన్నారు. వారు విద్యుత్ శాఖలో మేనేజర్‌గా సేవలందిస్తున్నారు. విద్యావంతులు. వారు ఇలా తెలిపారు: నేను అహ్మదియ్య ఖలీఫా గారి ప్రసంగాన్ని విని చాలా ప్రభావితున్ని అయినాను. ఇస్లాంలో మహిళలకు ఎలాంటి హక్కులు లేవని నేను గతంలో భావించేవాడిని. కాని ఈ రోజు నేను ఈ ప్రసంగాన్ని విన్న తరువాత నాకు వాస్తవం తెలిసి వచ్చింది. అనగా ఇస్లాం మహిళల హక్కులను చాలా గొప్పగా వివరించింది. ఇంత వివరముగా మరే ఇతర ధర్మము కూడ వర్ణించలేదు. అహ్మదియ్య జమాఅత్ చాలా పటిష్టమైన వ్యవస్థ కల్గిన జమాఅత్ అని నేను గతంలో విన్నాను. కాని ఈ అహ్మదియ్య జమాఅత్ ఏ విధముగా ఒక నాయకుని చేతిపై ఐక్యమత్యంతో ఉన్నది. ఏ విధముగా ప్రపంచ శాంతి కోసం ప్రయత్నిస్తున్నది అనే విషయాన్ని నేడు నేను నా కన్నులతో చూస్తున్నాను.

జీంబియాకు చెందిన మరొక మిత్రుడు కాటేబూలే గారున్నారు. వృత్తి పరంగా వీరు పాస్టర్. వీరు ఇలా తెలిపారు: జల్సా సాలాన చివరి రోజు నేను ఖలీఫా గారి ముగింపు ప్రసంగాన్ని విన్నాను. చాలా ప్రభావితున్ని అయినాను. ఖలీఫా గారి ప్రసంగం చాలా ఆశ్చర్యపర్చింది.

ఇస్లాం ఇంత గొప్పగా మహిళల హక్కులను గూర్చి వివరించిందని నేను ఏ మాత్రం ఊహించలేదు. ఇస్లాం మహిళల హక్కులను కాలరాసిందని, మహిళలకు ఎలాంటి స్వాతంత్ర్యం లేదని ఇప్పటి వరకు నేను భావించేవాడిని. నా దృష్టిలో ఇస్లాం మహిళలను ఇంట్లోనే బంధిస్తుందనే భావన ఉండేది. కాని ఈ రోజు ప్రసంగాన్ని విన్న తరువాత నా ఆలోచనలే మారిపోయాయి.

ఇస్లాం మహిళలకు కల్పించిన హక్కులు క్రైస్తవ ధర్మం కూడ కల్పించలేదని బహిరంగముగా చెప్పడానికి నేను ఏ మాత్రం సంకోచించను. ఇతను క్రైస్తవ ఫాద్రి. మరల ఇలా తెలిపారు: ఇస్లాం కల్పించిన హక్కులను క్రైస్తవ ధర్మం కూడ కల్పించలేదు. మేము అనవసరంగా మా మహిళలపై దౌర్జన్యం చేస్తుంటాము. మహిళలను మా బానిసలుగా భావించుకుంటాము. ఖలీఫా గారు నిజమే చెప్పారు. పురుషులు ఏదో ఒక విధముగా తమ బలంతో, బలగంతో తమ హక్కులను చెల్లింప జేసుకుంటాడు. ఇస్లాం దౌర్జన్యపు బోధనలను నేర్పదని, ఇస్లాం చాలా అందమైన బోధనలను నేర్పిస్తుందని నేను ఈ రోజు గ్రహించాను.

మరల అయివరీ కోస్ట్‌కు చెందిన జమాఅత్ పట్ల అవగాహన కల్గిన మిత్రుడు ఉన్నారు. వారు ఇలా తెలిపారు: వివిధ మార్గాల ద్వారా జమాఅత్‌ను గూర్చిన వివరాలు తెలుస్తునే ఉన్నాయి. కాని జల్సా సాలాన యు.కే ఒక అద్భుతమైన విధానంలో జమాఅత్ పరిచయాన్ని వ్యక్తపర్చింది. వారు మొదటిసారిగా జల్సాను టీ.విలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూశారు. జల్సా ఏర్పాట్లను చూసి వారు చాలా ప్రభావితులైనారు. మరల ఇలా తెలిపారు: ఇంత పెద్ద సంఖ్యలో, ఒక పద్ధతి ప్రకారంగా, ఒక క్రమశిక్షణతో ఒక కార్యక్రమంలో పాల్గొనడంను చూసినచో వారిపై ఖలీఫా గారి శిక్షణ ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపిందో అర్థం చేసుకోవచ్చును. మరల ఇలా తెలిపారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చేతిలో ప్రజలు ఏ విధముగా బైఅత్ చేశారో నాకు తెలియదు. కాని నేడు ఖలీఫా చేతిలో ప్రజలు బైఅత్ చేయడాన్ని చూసిన తరువాత మనస్సుపై చెరగని ప్రభావం పడింది. దాని స్థితిని నేను వర్ణించలేక పోతున్నాను. మరల వారు ఇలా తెలిపారు. ఇక నుండి నేను క్రమం తప్పకుండా ఖలీఫా గారి ప్రసంగాలను వింటాను.

కోంగో కోంషాస దేశానికి చెందిన ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి కూడ ఇక్కడికి వచ్చారు, జల్సాలో పాల్గొన్నారు. వారు కూడ ప్రజల మధ్యలో ఉండి నా ప్రసంగాన్ని విన్నారు. వారు ఇలా అన్నారు: ఇప్పటి వరకు నేను ఎందుకు అహ్మదీయుడిని కాలేదని ఈ ప్రసంగం నన్ను ఆలోచించేలా చేసింది. ఇక నుండి మిషన్ హౌజ్‌కు వస్తుంటానని, జమాఅత్‌ను గూర్చి ఇంకా వివరముగా తెలుసుకుంటానని వారు వాగ్దానం కూడ చేసి వెళ్ళారు.

ఎంటిఏ ద్వారా కూడ ప్రజలు క్రమశిక్షణను నేర్చుకుంటారు.

మరోవ జమాఅత్‌కు చెందిన మిషన్ హౌజ్‌లో కూడ జల్సా సాలాన యు.కే కార్యక్రమాలను చూసే ఏర్పాట్లు చేయడమైనది. కేమ్రోన్ దేశంలోని ఒక నగరం పేరు మరోవ. ఇక్కడ జల్సా కార్యక్రమాలను చూసేవారిలో సమీప గ్రామానికి చెందిన ఉమ్ముల్ అనే మహిళ కూడ ఉన్నారు. మూడు రోజులు జల్సా కార్యక్రమాలను చూశారు. జల్సా సాలాన పూర్తి అయిన తరువాత వారు అక్కడి ప్రజలతో ఇలా అన్నారు: మనకు ఎంటిఏ ఉండడం నిజంగా అదృష్టం. ఎం.టి.ఏ ఒక టీవి చానలే కాదు. దానిని ఒక పాఠశాలగా, విశ్వవిద్యాలయంగా చెప్పుకోవచ్చును. అక్కడ ప్రజలు ప్రతి రోజు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చును. మేము కూడ ఈ మూడు రోజులలో చాలా విషయాలను నేర్చుకున్నాము. మనకు కేబుల్ ద్వారా కూడ ఎంటిఏ అందుబాటులో ఉన్నది. (అక్కడ కేబుల్ ద్వారా కూడ ఎంటిఏ ప్రసారం చేస్తున్నారు.) అందుకే మనలో ప్రతి ఒక్కరు దాని నుండి ప్రయోజనాన్ని పొందాలి. మరల వారు అక్కడి ప్రజలతో ఇలా అన్నారు. మనం క్రమం తప్పకుండా మన ఇళ్ళలో ఎంటిఏ కార్యక్రమాలను చూడాలి. మన పిల్లలకు కూడ చూపించాలి. ఫలితముగా అందరికి ఇస్లామీయ విజ్ఞానం పెరుగుతుంది. ప్రత్యేకించి ఖలీఫా గారి ప్రసంగాలను, జుమా ప్రసంగాలను తప్పకుండా వినాలి. అప్పుడే మన విశ్వాసం పెరుగుతుంది.

కోంగో కోనషాసాకు చెందిన మరొకరి అభిప్రాయం. ఇలేబూ జమాఅత్‌లో జల్సా కార్యక్రమాలను చూపించడం కోసం హంబలీ ముస్లిం ఇమాం గారిని ఆహ్వానించడం జరిగింది. జల్సా చివరి రోజు కార్యక్రమం తరువాత వారు ఇలా అన్నారు: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు మనకు బోధించిన బోధనలను నిజమైన ఇస్లామీయ బోధనల రూపంలో అహ్మదియ్య జమాఅత్ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. నా దృష్టిలో ఇది అహ్మదియ్య జమాఅత్ యొక్క ప్రత్యేక ఘనత. ఇక ఏది ఏమైనప్పటికి నేను మాత్రం అహ్మదియ్య జమాఅత్‌లో చేరాలని నిశ్చయించుకున్నాను. అల్లాహ్ తాలా నన్ను అనుగ్రహించుగాకా!, అల్లాహ్ తాలా అనుగ్రహించుగాకా!. అల్లాహ్ తాలా వారికి భాగ్యాన్ని కల్పించుగాకా!.

అల్బానీయ నుండి ఒక ప్రచారం పొందున్న విల్మా అనే మహిళ కూడ జల్సా సాలానలో పాల్గొన్నది. ఆ మహిళ ఇలా తెల్పినది: జల్సా సాలాన యు.కే నిజానికి ఒక గొప్ప జల్సా. ఈ జల్సాలో చాలా ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. నేను ఇప్పటి వరకు జల్సాలో పాల్గొనలేదు. కాని ఈ జల్సాలో పాల్గొనడం వలన ఈ జమాఅత్ ప్రాధాన్యతను, సత్యతను తెలుసుకొనుటకు శ్రద్ధను కేటాయించాలనే

ప్రేరణ కల్గింది. వర్తమాన ఖలీఫా గారి ప్రసంగం విన్న తరువాత వారు తెల్పిన ఆంశాలను నేను కూడ ఏకీభవిస్తున్నట్లుగా అనిపించింది. వారు ఒక్కొక్క ఆంశాన్ని ఎంతో వివరముగా విడమర్చి చెప్పారు. తద్వారా నా విశ్వాసం కూడ పెరిగింది. ఇక ముందు నుండి ఇలాంటి జల్సాలో వ్యక్తిగతంగానైన పాల్గొనాలనే ఆకాంక్ష కూడ నాలో కల్గింది.

ఫ్రెంచ్ గయానలో ఒక అఫ్గాన్ మహిళ ఉన్నారు. వారు తమ పిల్లలతో కలిసి జల్సా ముగింపు కార్యక్రమాలను వినడానికి వచ్చారు. వారు ఇలా తెలిపారు: అహ్మదియ్య జమాఅత్‌ను గూర్చి మాకు కొంత అవగాహన ఉన్నది. కాని జల్సా సాలాన యు.కేలో ఖలీఫా గారి ప్రసంగాలను విన్న తరువాత నాలో ఒక విచిత్రమైన పరివర్తనం కల్గింది. ఇస్లాంలో మహిళల హక్కులను గూర్చి విన్న తరువాత మన ధర్మం మహిళ హక్కులను గూర్చి ఎంతగా శ్రద్ధ తీసుకుంటుందో అనే మనశ్శాంతి దొరికింది. మరల ఇలా తెలిపారు: అఫ్గానిస్తాన్‌లో తాలిబాన్‌లు నెలకొల్పుతున్న ఇస్లాంలో మహిళలకు ఎలాంటి విలువ లేనందునే బహుశా నాలో ఈ భావన కల్గి ఉండవచ్చును. నిజానికి ఇస్లాం ధర్మం మహిళల హక్కులను పూర్తి స్థాయిలో చెల్లిస్తుంది.

లైబీరియాలో ఒక ముస్లిమేతర అతిథి అమోస్ వోన్సే గారు ఉన్నారు. వారు పోలీస్ శాఖకు చెందిన సి.ఐ.డి కమాండర్‌గా పని చేస్తున్నారు. విద్యావంతులు. ఆహ్వానించగా వారు జల్సాలో పాల్గొన్నారు. ఆపై ఇలా అన్నారు: రెండవ రోజు నా ప్రసంగాన్ని విన్న తరువాత వారు చాలా ప్రభావితులైనారు. రెండవరోజు కార్యక్రమాలను చూడడం కోసం వారిని ఆహ్వానించారు. మూడవ రోజు వారే స్వయముగా వచ్చారు. ప్రసంగం తరువాత వారు తమ అభిప్రాయాన్ని ఈ విధముగా వెళ్ళడించారు. ఇస్లాంను గూర్చి నేను చాలా చెడుగా ఆలోచించేవాడిని. అందుకు కారణం కూడ కొందరు ముసల్మానుల నడవడికయే. కాని జల్సా కార్యక్రమాలను చూసిన తరువాత ఇస్లాం ఒక శాంతియుత ధర్మమని, అహ్మదియ్య జమాఅత్ అన్ని విధాలుగా మానవ సేవ చేయుటలో ముందుంటుందని గ్రహించాను. అందుకే నేటి నుండి ఇస్లాం పట్ల నాకున్న అభిప్రాయాన్ని మార్చుకుంటున్నాను. నాలో ఉన్నటు వంటి భయాందోళనలు కూడ దూరమైపోయాయి.

మరల వారు ఇలా అన్నారు: ఒకవేళ ఈ ప్రాంతంలో అహ్మదియ్య జమాఅత్ చాలా కాలం ముందే వచ్చినచో ఇప్పటి వరకు చాల మంది అహ్మదియ్య జమాఅత్ ద్వారా ఇస్లాంలో చేరేవారు.

ఫ్రెంచ్ గయాన. అక్కడ కూడ జమాఅత్ పరంగా జల్సా కార్యక్రమాలను చూపించే ఏర్పాట్లు చేశారు. చిన్న జమాఅత్. కొద్ది మంది మాత్రమే ఉన్నారు. వారందరు వచ్చారు. అక్కడికి హీటి దేశానికి చెందిన ఇద్దరు క్రైస్తవ సోదరులు కూడ వచ్చారు. వారికి జమాఅత్ సందేశం అందిస్తున్నారు. వారు ముగింపు కార్యక్రమాన్ని వినడానికి వచ్చారు. వారు ఇరువురు మిత్రులు. వారు ఇలా అన్నారు: మీ ఖలీఫా ఆరు తమ ప్రసంగం కోసం ఎంచుకున్న ఆంశం “అనగా ఇస్లాంలో మహిళ హక్కులు ”ను చూసి మేము చాలా ఆశ్చర్యపోయాము. ఎందుకనగా గత రెండు రోజులుగా మేము మహిళల హక్కుల విషయంలో ఇస్లాం ఏమి బోధిస్తుంది? అనే ఆంశంను గూర్చియే చర్చించుకుంటున్నాము. మహిళ హక్కులను గూర్చి ఇస్లాం ఇంత గొప్పగా, సంపూర్ణముగా వివరిస్తుంది, బోధించిందని మాకు తెలియనే తెలియదు.

ఒకవేళ మేము ఈ రోజు మీ ఖలీఫా గారి ప్రసంగాన్ని వినకపోయినచో బహుశా మాకు ఇంతటి అందమైన సంపూర్ణమన బోధనలను గూర్చి తెలిసి ఉండేది కాదు. నేటి కాలంలో మహిళల హక్కులను గూర్చి చాలా చోట్ల చర్చిస్తుంటారు. కాని స్త్రీ పురుషుల ఇరువురి బాధ్యతలను గూర్చి వాస్తవ రూపంలో ఇస్లాంయే మనకు వివరిస్తుంది. ప్రస్తుతం వీరు లైఫ్ ఆఫ్ ముహమ్మద్ పుస్తకాన్ని చదువుచున్నారు. వారు మరికొన్ని లిటరేచర్‌ను కూడ చదవడం కోసం అడిగి తీసుకున్నారు.

మారిషెస్‌కు చెందిన నివేదిక: అక్కడ కూడ ప్రసారాలు జరుగుచుండగా వాటిని చూడడానికి ప్రజలు ఏకమైనారు. పార్లమెంట్ సభ్యురాలు తానియా దేవిలే గారు కూడ ఆయా కార్యక్రమాలను చూడడానికి వచ్చారు. వీరు పార్లమెంటరీ బోర్డు ప్రైవేట్ సెక్రటరిగా కూడ కొనసాగారు. వారు ఇలా తెలిపారు: చాలా అద్భుతమైన దృశ్యం ఇది. అహ్మదియ్య జమాఅత్ కార్యక్రమాలను, అహ్మదియ్య జమాఅత్ సాంస్కృతి సాంప్రదాయాలను చూడడానికి ఇదొక మహత్తరమైన అవకాశం. చాలా ఆశ్చర్యకరమైన విషయమేమనగా మీరు లండన్‌లో ఇంత పెద్ద ఎత్తున ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ధార్మిక వ్యవస్థకు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నది. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు తమను తాము పరీక్షించుకొనుటకు, ఆధ్యాత్మికతను పెంపొదించుకొనుటకు ప్రజలందరు ఏకం కావడం చాలా గొప్ప విషయం. ప్రస్తుతం మనం చాలా క్లిష్ట పరిస్థితులలో ఉన్నాము. నేడు ప్రపంచం అనేక సమస్యలతో సతమతమవుతుంది.

నా దృష్టిలో ఇలాంటి కార్యక్రమాలే సమాజాన్ని సరైన దిశలో నడిపిస్తాయి, ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు తీసుకవెళుతాయి. ఈ అనుభవం నాకు ఒక నూతన సంతోషాన్ని కల్గిస్తుంది. ఇక్కడ నేను అనేక విషయాలను నేర్చుకున్నాను. వాటితో పాటు నేను గడిపిన ఈ క్షణాలు కూడ నాకు చాలా విలువైనవి.

నూతన అహ్మదీయులు కూడ తమ అభిప్రాయాలను వ్రాసి పంపారు: బుకీనా ఫాసుకు చెందిన ఒక నూతన అహ్మదీ మహిళ హవా గారు ఇలా తెలిపారు: మనం అహ్మదియ్యత్‌ను నిజమైన ఇస్లాంగా భావించి బైఅత్ చేయడానికి గల కారణం మనం కేవలం ఇతరులను అహ్మదియ్యత్‌లో చేర్చడం కోసమో కాకుండా సమాజంలో మనం ఏ విధముగా ఇతరుల కొరకు స్వయముగా ఒక అహ్మదిగా ఉదాహరణగా నిలుస్తూ, మన మాటలను మన చేతలను ఒకటిగా చేసి మన విశ్వాసాన్ని పటిష్టం చేసుకోవడమేగాకుండా మన నమ్మకాన్ని కూడ పెంచుకోవడం కోసమే బైఅత్ చేశామని ఖలీఫా గారి స్పష్టమైన పదాల ద్వారా మనకు తెలుస్తుంది.

ఆఫ్రీక ప్రజలు నిరక్ష్యరాసులని ప్రజలు అంటూ ఉంటారు. ఇప్పుడు ఈ మహిళను చూడండి. వారు ఇలా తెల్పుచున్నారు. మనలో ఎలాంటి మార్పు కలగాలి అంటే మన మాటలు, చేతలు ఒకటిగా ఉండాలి. ఈ విషయం ప్రతి చదువుకున్న అహ్మదీయుడి కోసం, తమకు తాము బాగా చదువుకున్న వారమని భావించుకునే అహ్మదీయుల కోసం, యూరప్‌లో నివాసం ఉండే అహ్మదీయుల కోసం, అభివృద్ధి చెందుతున్న దేశాల వారికోసం వర్తిస్తుంది. ఆ విషయం ఆలోచించేలా చేస్తుంది. అన్ని చోట్ల తమ మాటలను, చేతలను ఒకే విధముగా ఉండునట్లు చూసుకోవాలి.

ఇండోనేషియాలో కూడ ఒక నూతన అహ్మదీయురాలు ఉన్నారు. వారు ఇలా తెలిపారు: జల్సా సాలాన యు.కే ఒక అసాధారణమైన కార్యక్రమం. మరల ఇలా తెలిపారు. నేను ఒక నూతన అహ్మదీయురాలిని. ఈ ఆధ్యాత్మికత గల జమాఅత్ ద్వారా నా ఆధ్యాత్మికతను పెంచుకొను అద్భుత అవకాశం. ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఈ శుభప్రదమైన జల్సాలో పాల్గొనడాన్ని నేను చూస్తున్నాను. నిజానికి నేను ఈ జల్సాను టీ.విలోనే చూశాను. కాని నా మనస్సు, మేధస్సు రెండు యూ.కేలోని జల్సా ప్రాంగణంలో ఉన్నాయి. ఈ జల్సా వలన ఈ దైవజమాఅత్ పట్ల నా విశ్వాసం ఇంకా పెరిగింది. రాబోవు రోజులలో కూడ నేను ఇంకా ధార్మికురాలిని అవుతానని భావిస్తున్నాను.

కోంగో/బ్రెజిల్‌కు చెందిన ఒక నివేదిక ప్రకారం మహిళల ప్రాంగణంలో నేను ఇచ్చిన ప్రసంగాన్ని విన్న అక్కడి ప్రాంతీయ మహిళలు మేము కూడ ఇస్లాం మరియు అహ్మదియ్యత్‌ను వ్యాపింపజేయుటకు తమను తాము మరిము తమ పిల్లలను అన్ని రకాల త్యాగాల కోసం సిద్ధము చేస్తాము అని వాగ్దానం చేశారు.

మరొక నూతన అహ్మదీయురాలు ఇలా అన్నారు: ఆధ్యాత్మిక వాతవరణంలో మూడు రోజులు గడిచాయి. ప్రతి రోజు ఇలాంటి వాతవరణంలో గడవాలని, ఈ ఆధ్యాత్మిక వాతవరణపు మాదుర్యాన్ని ఆస్వాదించాలని మేము ఆశిస్తున్నాము.

మరల ఇండోనేషియాకు చెందిన మరొక నూతన అహ్మదీయుడు హెంద్రి హిమా వన్ గారు ఇలా తెలిపారు: నేను ఒక నూతన అహ్మదీయుడిని. జల్సా సాలాన యు.కేను ప్రత్యక్ష ప్రసారాలలో చూసిన తరువాత నాదే ఒక మాట. చాల అద్భుతం. నేను చాలా ఆశ్చర్యపోయాను. ప్రపంచం మొత్తం మీద కేవలం ఒకే ఒక జమాఅత్ సభ్యులు ప్రపంచం మొత్తం వ్యాపించి ఉన్నారు. ఒక టీ.వి స్టేషన్ ఉన్నది. 24 గంటలు ప్రసారాలు చేస్తుంది. యహూవాజ్ వింట్స్, మోర్‌మన్స్, అడ్వనిస్ట్ ఎస్‌డిఏ వంటి క్రైస్తవ సంస్థల వలే ఏదైన ఇస్లామీయ సంస్థ ఉన్నదా? అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని. పై క్రైస్తవ సంస్థలలో లక్షలాది మంది అనుచరులు ఉన్నారు. వందల దేశాలో ఈ సంస్థలు పని చేస్తున్నాయి. కాని నా ప్రశ్నకు కూడ సమాధానం లభించింది. అహ్మదియ్య జమాఅత్‌యే ఇస్లాం యొక్క సంస్థగా ప్రపంచమంత విస్తరించింది. నేను ఈ జమాఅత్ సభ్యుడిని అయినందుకు నాకు చాలా

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **“ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.” అనగా అతనికి కూడ కూర్చోవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

గర్వంగా ఉన్నది. ఈ ఇస్లామీయ సంస్థయే నా వ్యక్తిత్వానికి, నా నడవడికకు అనుకూలంగా ఉన్నది. ఇప్పుడు నేను అహ్మదీయుడిని అయిన తరువాత ఒక ప్రయోజన కారి మనిషిగా మారుతున్నాను. శారీరక మరియు ఆధ్యాత్మిక ప్రగతిని కూడ సాధించగలను.

ఖజకిస్తాన్ నుండి బకూవూ బాయవస్ దావరియ గారు ఇలా తెల్పుచున్నారు: జల్సా నా మనస్సుపై చెరిగిపోని ఒక ముద్రను వేసింది. నేను జల్సా సాలాన కార్యక్రమాలను నా భార్యతో పాటు ఒక ఆధ్యాత్మిక వాతవరణంలో చూశాను. ఖలీఫా గారి ప్రసంగాలు మనస్సును చలింపజేశాయి. వాటిని నేను పదాలలో వర్ణించలేక పోవుచున్నాను. అదే విధముగా ఇతర వ్యక్తుల ఉపన్యాసాలు కూడ చాల గొప్పవిగా ఉన్నాయి. ప్రపంచ అహ్మదీయులందరికి ఎం.టి.ఏ ద్వారా జల్సా కార్యక్రమాలను వీక్షించే భాగ్యము లభించింది. అల్లాహ్ తాలా సేవకులందరికి మరియు నిర్వాహకులకు ఉత్తమ ప్రతిఫలమును అందించుగాకా!. ఈ ఆధ్యాత్మిక భావనలు, స్థితిగతులు వచ్చే సంవత్సరం జల్సా వరకు ఉండాలని ఎల్లప్పటికి ఉండాలని వారు తమ కోసం కూడ దుఆల విన్నపం చేశారు.

జేంబియాకు చెందిన ఒక నూతన అహ్మదీయుడు నా ప్రసంగాన్ని విన్నాడు. ఫలితముగా వారిలో కల్గిన భావాలను అదుపుచేసుకోలేక పోయాడు. కన్నుల నుండి కన్నీరు కారాయి. ప్రక్కన కూర్చున్న మరో మిత్రుడు కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించిన సమాధానం చెప్పలేక పోయాడు. అక్కడి నుండి కొన్ని నిమిషాల కోసం బయటికి వెళ్ళాడు. కన్నీరు తుడ్చుకొని మరల తిరిగి వచ్చాడు. కారణం అడుగగా, జీవితంలో మొదటి సారి నేను ఖలీఫాను చూశాను. మరియు ఖలీఫా మాటలను విన్నాను. అందుకే నా కన్నుల నుండి కన్నీరు కారాయి అని సమాధానం ఇచ్చాడు.

మరల ఇలా తెలిపారు: నా వయస్సు 80 సంవత్సరాలు. నేను నా జీవితం మొత్తాన్ని తోడెళ్ళ మధ్యలో గడిపాను. అనగా దౌర్జన్యుల మధ్యలో గడిపాను. అహ్మదియ్యత్‌లో చేరిన తరువాతయే నాకు ఇస్లాం యొక్క నిజమైన బోధనలు ప్రేమను పంచుతాయి కాని ప్రజల మధ్యలో విద్వేషాలు పంచవు అని తెలిసింది. మరొక రోజు ఫజర్ నమాజ్ తరువాత వినిపించిన ఉపదేశాలను విని లేచి నిలబడ్డారు. అందరిని ఉద్దేశించి ఇలా అన్నారు. ఈ మస్జిద్‌ను ప్రజలలో నింపడం కేవలం మౌల్వీ గారి పనియే కాదు. మనందరి బాధ్యత. మనం అందరం కలిసి ప్రచారం చేయాలి.

ఆస్ట్రేలియాకు చెందిన ఒక నూతన అహ్మదీయుడు ఈసా గిబ్రీ గారు ఉన్నారు. వీరు ముందుగా బైఅత్ చేశారు. కాని అహ్మదీయేతరుల ఆరోపణలకు ప్రభావితులయ్యేవారు. ప్రత్యేకించి జల్సాలు నిర్వహించడం దురాచారం అనే విషయానికి ప్రభావితుడైనాడు. వారు ఆస్ట్రేలియాలో మస్జిద్ బైతుల్ మస్రూర్‌లో అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమంలో పాల్గొని ఇలా అన్నారు. నా అనుమానలన్నియు దూరమైనాయి. ఎందుకనగా జల్సా కేవలం అల్లాహ్ కొరకే ఏర్పాటు చేస్తారనే విషయం నాకు అర్థమైంది. ఇది నా కొరకు నా విశ్వాసాన్ని పెంచుకోవడానికి ఒక సదవకాశం. బైఅత్ కార్యక్రమములో వర్తమాన ఖలీఫా గారితో దుఆలో పాల్గొనడం వలన నా దుఆలు కూడ స్వీకరించబడుతాయి అనే ఒక సంపూర్ణ విశ్వాసం కల్గింది.

జల్సా కార్యక్రమాలను చూడడం వలనే ప్రజల విశ్వాసం కూడ పటిష్టమవుతుంది. ఆస్ట్రేలియా నుండి మరొక నూతన అహ్మదీయుడు మికియాస్ గేబ్రె గారు ఇలా తెలిపారు: అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమం నన్ను చాలా ఆశ్చర్యపర్చింది. ఆ సమయంలో నేను ఏ ఆధ్యాత్మిక స్థితి నుండి ముందుకు వెళ్ళానో అట్టి స్థితిని నేను ఎన్నడు కూడ పొందలేదు. ఆ ఆధ్యాత్మిక కార్యక్రమము ఒక ఆధ్యాత్మిక మాదుర్యంను మరియు మనశ్శాంతిని అందించాయి.

లిసీథూ నుండి ఒక నూతన అహ్మదీయుడు యూసుఫ్ లా బీసా గారు ఇలా తెలిపారు: నేను మొదటి సారిగా జల్సాలో పాల్గొంటున్నాను. నేను మొదటి సారిగా ఖలీఫాగారిని చూస్తున్నాను. ఏ విధముగానైతే వారు సమాజంలో పేరుకపోయిన లోపాలను, చెడులను ఇస్లామీయ ఉన్నత బోధనల ద్వారా సంస్కరిస్తున్నారో ఆ విధానాన్ని నేను నేటి వరకు చూడలేదు. వినలేదు. క్రైస్తవులలో కూడ నేను ఇలాంటివి నేర్చుకోలేదు.

| | |
|---|---|
| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***

నేను అహ్మదియ్యత్‌ను గూర్చి తెలుసుకుంటున్న సమయంలో నేను మొదటి సారిగా ఖలీఫా గారి ఫోటోను చూసినప్పుడు ఆ సమయంలో అల్లాహ్ తాలా కలలో ఇది సత్యమైన ధర్మము అని తెల్పినాడు. అహ్మదియ్యత్ వైపు రావడం, స్వచ్ఛమైన ఇస్లాంను పొందడం నిజానికి అల్లాహ్ తాలా నాకు అనుగ్రహించిన మార్గదర్శనం వలనే అది కూడ ఖలీఫా గారిని చూసిన తరువాత లభించింది. ఈ విధముగా జీవితంలో మొదటి సారి నేను జల్సాను చూశాను. మనస్సును కదలింపజేయు బైఅత్ యొక్క కార్యక్రమమును చూడడం. ఆ కార్యక్రమములో పాల్గొనడం పాల్గొన్న తరువాత నేను నాలో ఒక మార్పును చూశాను. నాకు ఒక నూతన జీవితం లభించినట్లు అనిపించింది.

అల్బానియాకు చెందిన పెలుంబ్ బేజా గారు జర్మనీలో చరిత్రను బోధించు ఉపాధ్యాయులు. వారు మూడు నాలుగు సంవత్సరాల క్రితం బైఅత్ చేశారు. వారు ఇలా తెలిపారు. ఈ సంవత్సరం జల్సా సాలాన యు.కేలో వర్చువల్ ద్వారా పాల్గొన్నాను. కాని నాకు మాత్రం నేను స్వయంగా జల్సాలో పాల్గొన్నట్లుగా అనిపించింది. జల్సా వాతవరణం, వర్తమాన ఖలీఆ గారి ప్రసంగాలు ఎంతగా ప్రభావాన్ని చూపాయి అనగా నేను కూడ జల్సా ప్రాంగణంలోనే కూర్చున్నాను అనే అంతగా చూపాయి.

ఈ అంతర్జాతీయ్య జల్సా సాలాన జమాఅత్‌లో ఐక్యత ఉన్నదని తెల్పుటకు గట్టి నిదర్శనం. ప్రపంచ అహ్మదీయులందరు ఒకే ఖలీఫా చేతిలో ఏకమై ఉన్నారు. అహ్మదీయ్య సభ్యులందరు తమ తమ బాధ్యతలను అర్థం చేసుకుంటారు. మరల వారు ఇలా తెలిపారు: అందరు ఖలీఫా గారి ఉపదేశాలను వినడానికి ఆసక్తిగా ఉన్నారు. వాటికి అనుగుణముగా నడుచుకోవడానికి సిద్ధముగా ఉన్నారు. మరల ఇలా తెలిపారు: తమ జల్సా ముగింపు ప్రసంగంలో ఎంతో సాధారణ పదాల ద్వారా ఎంతో స్పష్టముగా మనకు ఉపదేశించారు. ఆయా పదాలను సమాజంలోని ప్రతి వ్యక్తి సులువుగా అర్థం చేసుకోగలడు. ఈ ప్రసంగం మనలను మన బాధ్యతల ముందు నిలబెడుతుంది. ప్రత్యేకించి మమ్ములను, అల్బానియా సమాజంలో ఉండేవారిని. ఇక్కడి సమాజంలో మహిళల హక్కుల విషయంలో చాలా సమస్యలు ఉన్నాయి.

మరల నైజీరియాకు చెందిన గుడాఁ రూమ్జి రీజన్‌కు చెందిన ఒక మహిళ ఇలా తెలిపారు: ఈ రోజు మహిళలను ఉద్దేశించిన ప్రసంగాన్ని వినడం వలన నాకు మహిళల హక్కులు వారి బాధ్యతలను గూర్చిన నిజమైన అవగాహన కల్గింది. మరల ఇలా తెలిపారు: మీరు హజ్రత్ అమ్మాజాన్ రజి గూర్చి వారు ఏ విధముగా పిల్లల మంచి చెడులను చూశారు, ఏ విధమైన ఆధర్శవంతమైన క్రమశిక్షణను ఇచ్చారు అని ఉదాహరణ ఇచ్చినప్పుడు ఈ రోజు నుండి నేను కూడ నా పిల్లలకు సరైన శిక్షన ఇవ్వడానికి ప్రత్యేక శ్రద్ధను కనబర్చుతానని వాగ్దానం చేశాను. తద్వారా వారు కూడ ఆదర్శవంతమైన సేవకులుగా మారుదురు.

చూడండి అల్లాహ్ తాలా ఏ విధముగా మార్పును సృష్టిస్తున్నాడు.

ఆతిఫ్ జాహిద్ గారు ఎడ్‌లిడ్ మురబ్బి సిల్‌సిలాగా కొనసాగుచున్నారు. వారు ఇలా వ్రాసారు: ఎడిలిడ్ సమయానికి మరియు లండన్ సమయానికి 8 గంటల30 నిమిషాల వ్యతాసం గలదు. జల్సా కార్యక్రమాలన్నియు చాలా రాత్రివేళ వరకు కొనసాగేవి. ప్రజలు వస్తారో రారో అనే చింతన ఉండేది. సంఖ్య తక్కువగా ఉంటుందని భావించాను. కాని ప్రజల నుండి అసాధారణమైన స్వచ్ఛత బహిర్గతవమైనది. జుమా రోజు పని రోజు అయినా కూడ మస్జిద్‌కు ప్రజలు వచ్చారు. ప్రసంగాన్ని విన్నారు. అంతర్జాతీయ బైఅత్ కార్యక్రమములో పాల్గొన్నారు. రాత్రి వేళ 3 గంటల వరకు మేల్కొని జల్సా ముగింపు ప్రసంగాన్ని విన్నారు. ఖిలాఫత్ పట్ల వారికి ఉన్నటు వంటి అభిమానం చూడదగినది. ఈ విషయంలో ఎంటిఏ వారికి కృతజ్ఞతలు తెల్పుచున్నాము.

ఖజకిస్తాన్ నుండి గుల్యాన్ ఆయి మకీనా గారు ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా అనుగ్రహం వలన జల్సా సాలాన ముగింపుకు చేరుకున్నది. వివిధ అంశాలపై ఖలీఫా గారు ఇతర వక్తలు ఉపన్యాసాలు, ప్రసంగాలు చేశారు. అవి చాలా ప్రయోజనకరంగా, మనస్సును హత్తుకునేలా ఉన్నాయి. ఆ ఉపన్యాసాలు నా మనస్సుపై చెరుగని ముద్రను వేశాయి. ప్రచారం చేయు విధానాన్ని కూడ నేను నేర్చుకున్నాను.


సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్



SABIR BURQA HOUSE
ALL TYPES OF READYMADE BURQA
ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు
కొరియర్ ద్వారా కూడా పంపబడును
CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

ఇతర ప్రేక్షకులకు కూడ వారి ప్రశ్నలకు సమాధానాలు దొరకవచ్చునని నేను భావిస్తున్నాను. అదే విధముగా అల్లాహ్ తాలా నాకు బైఅత్‌ను పునరుద్దరించుకోను అవకాశాన్ని కల్పించాడు. అల్లాహ్ తాలా ప్రజల కన్నులను, మనస్సును తెరుచుగాకా!, వారికి సన్మార్గంను ప్రసాదించుగాకా!.

యమన్ నుండి షీమా ఖాసిం గారు ఇలా తెలిపారు: మేము జల్సా కార్యక్రమాలను విన్నాము. ఆ సమయంలో మేము స్వర్గంలో ఉన్నట్లుగా అనిపించింది. ఇస్లాం యొక్క సూర్యుడు మరల మాపై ఉదయించినట్లుగా , మా మనస్సుకు, మా ఆత్మకు తాజా దనాన్ని ఇచ్చినట్లుగా కూడ అనిపించింది. మాలో నిజమైన విశ్వాసం, అభిమానం, ఐక్యత, సుగుణాల స్ఫూర్తిని నింపింది. మేము మీకు దూరంగా ఉన్నా మా మనస్సులు మాత్రం మీకు దగ్గరిగానే ఉన్నాయి. మనం అందరం ఒకే ఇంటిలో ఉన్నాట్లుగా ఉంది. ఒక అహ్మదీ కాకుండా మరెవరు కూడ ఈ భావనను గుర్తించలేరు. మా దేశంలో భారి వర్షాలు కురుస్తున్న కూడ జల్సా మూడు రోజులు మాత్రం వాతవరణం ప్రశాంతంగా ఉన్నది. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన మేము జల్సా కార్యక్రమాలను చూశాము. మౌలాయే కరీం ఖిలాఫత్‌కు పటిష్టతను చేకూర్చుగాకా!. ఖిలాఫత్ లేకుండా మనకు జీవితం లేదు, దానికి ఒక అర్థం లేదు.

మరల కబాబీర్ నుండి మరొక అరబ్ మహిళ దాఅ గారు ఇలా వ్రాసారు: మీ ప్రసంగంలోని అంశాలను నోట్ చేసుకున్నాను. జల్సా ముగింపు కార్యక్రమములో మహిళల హక్కులను గూర్చి మీరు చూపించి శ్రద్ధకు మేము ఋణపడి ఉన్నాము. నా హక్కులను, నా మనోభావాలను కాపాడునట్టి ధర్మంలో నేను ఉన్నాను. ఈ విషయాలన్నింటిని నేను నా ముస్లిమేత మహిళల ముందు ప్రస్తావించడాన్ని గర్వంగా భావిస్తున్నాను.

మరల మహిళ కోణంలో పురుషుల హక్కులను గూర్చి మీరు మాకు వివరముగా తెలిపారు. తద్వారా నేను నా తండ్రి, నా సోదరుడు, నా భర్త హక్కులను చెల్లిస్తున్నానా? లేదా? అని పరిశీలించుకున్నాను. బైఅత్ కార్యక్రమంలో నిజంగా మేము ఖలీఫాతో పాటు ఉన్నామనే భావన కల్గింది. మా మధ్యలో ఏ దేశం గాని, ఏ సముద్రం గాని లేవనిపించింది. నాకు ఎంతగా ఆనందం కల్గిందనగా నా గుండె పగిలినట్లుగా అనిపించసాగింది.

ఉర్దన్ నుండి అమతుల్ షాఫి అనే మహిళ ఇలా వ్రాసారు: నేను జల్సా సాలాన యొక్క మొదటి రోజు ప్రసంగాన్ని విన్నాను. నా శరీరం తన బాధ్యతలను తలచుకొని కంపించసాగింది. రెండవ రోజు కార్యక్రమములో వగాంద పేరు గల నగరానికి చెందిన అహ్మదీయులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరియు ఖలీఫాల పట్ల ఉన్న అభిమానాన్ని చూశాము. నిజానికి ఆ నగరం చాలా వెనుకబడి ఉన్నా, ఆ నగర ప్రజలు వారి కనీస జీవన అవసరాల కోసం ఎదురు చూస్తున్నా కూడ ఆ నగర ప్రజల నాయకుడి మాటలు విన్న తరువాత నా కళ్ళలో నుండి కన్నీరు కారాయి. అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స) మరియు మసీహ్ మౌవూద్ (అ)ను వారు ప్రేమిస్తున్నట్లుగా వారు చెప్పారు. నిజానికి ఇవి చాలా సాధారణ పదాలే అయినా కూడ ఆ పదాలు నా మనస్సుపై చాలా ప్రభావాన్ని చూపాయి.

మరల ఈజిప్ట్‌కు చెందిన మర్వా అబ్దుల్లాహ్ గారు ఈ విధముగా తెలిపారు. అమీరుల్ మోమినీన్! మీరు మా మనస్సులను మీ ప్రసంగాల ద్వారా మరియు ఇతర వక్తల ఉపన్యాసాల ద్వారా ఆధ్యాత్మిక సంపదతో నింపివేశారు. ఆ సమయంలో నేను ఆధ్యాత్మిక ఆకాశంలో ఎగురుతున్నాను. నా దేవుని సందర్శనం కోసం పరితపించ సాగాను. మీరు ప్రస్తావించిన సంతృప్తి చెందిన ఆత్మ స్థాయిని చేరుకోవాలనే ఉత్సాహం నాలో కల్గింది. చుట్టు ప్రక్కల ఏమి జరుగుతుందో పట్టించుకోకుండా నేను దేవుని ప్రేమలో అతని కలయికలో నిమగ్నమైపోవాలని నా మనస్సు కోరుకుంది. నా శరీరం నిస్పందేహంగా ప్రజల మధ్యలో ఉన్నా నా ఆత్మ మాత్రం దేవుని మరియు అతని ప్రవక్త (స) ప్రేమలో ఆకాశంలో చక్కర్లు కొట్టసాగింది.

అరబ్‌లకు ఒక ప్రత్యేకత ఉన్నది. వారు మంచి మంచి పదాలను ఉపయోగిస్తారు. వాటిని స్వచ్ఛతతో విధేయతతో ఉపయోగిస్తారు. అల్లాహ్ తాలా వారి విశ్వాసాన్ని, నమ్మకాన్ని పటిష్టం చేయుగాకా!.

మరల మలేషియాకు చెందిన ఒక నూతన అహ్మదీయుడు నజ్‌లాన్ అజ్‌గాన్ గారు ఇలా తెలిపారు: చాలా సాధారణమైన వ్యక్తి. చాలా సాధారణమైన జీవితాన్ని జీవించేవారు. ఆర్థిక పరిస్థితులు కూడ అంత బాగా లేకుండెవి. ఇంటర్నేట్ లో జల్సా చూడడానికి కూడ వారి వద్ద డబ్బులు లేకుండెను. వారు తమ ఇంటి ముందు ఉన్న మామిడి చెట్టుకు మామిడి పండ్లు తెంపివాటిని అమ్ముకొచ్చారు. మరల ఇలా తెలిపారు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో వారు ఇంటర్నేట్ డాటాను కొనుగోలు చేశారు. ఆ తరువాత జల్సా కార్యక్రమాలను విన్నారు.

గని బసావూ కు చెందిన ఒక అహ్మదీయేతర మిత్రుడు ఆసీని బిల్లు గారు జల్సా కార్యక్రమాలను విన్నారు. వారు ఇలా వ్రాసారు: నేను ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమాలను ఎన్నడు చూడలేదు. ప్రజలు తమ నాయకుడి మాటలను ఎంతో ప్రేమగా, ఎంతో గౌరవంగా వింటున్నారు. అంతర్జాతీయ బైఅత్ కార్యక్రమం చాలా చూడ ముచ్చటగా ఉన్నది. వారు కేవలం అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమాన్ని మాత్రమే చూశాను. ఆ కార్యక్రమములో జమాఅత్ సభ్యులందరు ఒకే చేతిలో ఏకమై కూర్చున్నారు. ఆ దృశ్యాలను చూసిన తరువాత అహ్మదియ్య జమాఅత్ సభ్యులు తమ ఖలీఫా పట్ల సంపూర్ణ విధేయతను చూపుతారనే నమ్మకం కల్గింది. ఇదే జమాఅత్ ప్రగతికి మూలం. నిజానికి అహ్మదియ్య జమాఅత్ ఒక సత్యమైన జమాఅత్. మీరు స్వచ్ఛమైన మార్గంలో ప్రయాణిస్తున్నారు.

మెక్సికో నుండి సరియా గోమెజ్ అతిథురాలు ఈ విధముగా తెలిపారు: జల్సాసాలాన యు.కే ప్రసంగాలను వినే అవకాశం లభించింది. ముగింపు ప్రసంగం చాలా ఆసక్తి కరముగా ఉన్నది. ఆ ప్రసంగంలో మహిళల హక్కులను గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఏ విధముగా ఇంటి పరిస్థితులను చక్కదిద్దవచ్చునో తెలుపడం జరిగింది. ఇలాంటి ఇస్లామీయ బోధనలను నేను కూడ స్వయముగా నా జీవితంలో ఆచరించుటకు ప్రయత్నిస్తాను. ఇవియే గాకుండా బైఅత్ కార్యక్రమంను చూసి చాలా ప్రభావితురాలిని అయ్యాను. ఆ భావనలను పదాలలో తెలుపలేము. కాని చాలా మనశ్శాంతి లభించినందకు ఆనందంగా ఉన్నది.

గనిబసావూకు చెందిన ఒక నూతన అహ్మదీయురాలు ఇలా తెలిపారు: వారు తన అహ్మదీయేతర మిత్రురాలైన జైనబున్నిసాను జల్సాకు తీసుకొని వచ్చారు. వారు ఇలా తెలిపారు: జల్సా కార్యక్రమాలు కొనసాగిన మూడు రోజుల పాటు పూర్తి కార్యక్రమాలను ప్రత్యేకించి మీ ప్రసంగాలను విన్నాము. చివరి రోజు మస్జిద్‌లో ఆ అహ్మదీయేతర మహిళ "జమాఅత్‌ను గూర్చి నాకు చాలా సందేహాలు ఉండేవి. కాని మీ ఖలీఫా గారి ప్రసంగాలు విన్న తరువాత ఆ సందేహాలన్నియు తీరిపోయాయి అని తెల్పుచూ తాను అహ్మదియ్యత్‌ను స్వీకరిస్తున్నట్లుగా, తన కుమారుడిని కూడ జమాఅత్‌కు అంకితం చేస్తున్నట్లుగా ప్రకటించారు.

గనీబసావూకు చెందిన ఒక గ్రామంలో నివస్తున్న కంబాకీటా అనే మహిళ అతిథురాలు జల్సా సాలాన యు.కేలో పాల్గొన్నారు. ఆపై అంతర్జాతీయ బైఅత్ కార్యక్రమమును గూర్చి విన్నందున దానిని గూర్చి మౌల్వీని అడిగి తెలుసుకోగా, మౌల్వీ గారు 10 నిబంధనలతో కూడిన బైఅత్ ను గూర్చి వివరించారు. అప్పుడు ఆ మహిళ కూడ బైఅత్ కార్యక్రమములో పాల్గొన్నది. బైఅత్ యొక్క పదాలన్నింటిని చదివింది. జల్సా ముగింపు కార్యక్రమపు ప్రసంగాన్ని కూడ విన్నది. ఆపై ఇలా అన్నాది. నేను అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమములో పాల్గొన్నప్పుడే నేను అహ్మదియ్యత్‌ను స్వీకరించాను. కాని ఈ ప్రసంగం తరువాత నేను ఆ విషయాన్ని ప్రకటిస్తున్నాను అని తెలిపారు. నేడు ఒకవేళ ముస్లిం సమాజాన్ని ఎవరైన కాపాడదలచినచో అది కేవలం అహ్మదయ్య ఖిలాఫత్‌యే కాపాడుతుంది. అంతేగాకా ఈ రోజు నేను అహ్మదియ్య ఖిలాఫత్‌లో చేరుతున్నాను అని కూడ ప్రకటన చేశారు. తన పిల్లలకు కూడ అహ్మదియ్యత్‌ను స్వీకరించమని తెలుపుతాను అని అన్నారు. ఎందుకనగా అహ్మదియ్యత్‌యే నిజమైన ఇస్లాం.

మరల కోంగూ బరాజీవిల్‌కు చెందిన వివిధ జమాఅత్‌లకు చెందిన మిష్నరీలు ఇలా వ్రాసారు: జల్సా కార్యక్రమాలన్నియు ఎంటిఏ ఆఫ్రికా ప్రత్యక్ష ప్రసారాల ద్వారా సామూహికముగా చూసే భాగ్యము లభించింది. ప్రసంగాల ద్వారా చాలా మంది ప్రభావితులైనారు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఆయా ప్రసంగాలను వినడం వలన, జల్సా కార్యక్రమాలను చూడడం ద్వారా 23 మందికి బైఅత్ చేయు భాగ్యము లభించింది.






కొంగోబరాజివేల్ నుండి మిష్టర్ మబూరాబిన్ జీలి గారిని జల్సా కార్యక్రమాలను చూడడానికి ఆహ్వానించారు. వీరు క్రైస్తవులు. రెండు రోజుల పాటు వీరు జల్సా కార్యక్రమాలను చూశారు. వారు ఇలా తెలిపారు: నేను ఇక్కడ రెండు రోజులుగా దేవుని హక్కులు, దేవుని దాసుల హక్కులు, నిష్టాపరత, ఇస్తిఘ్‌ఫార్‌లను గూర్చియే వింటున్నాను. ఇవి నా మనస్సులో గడ్డకట్టుకపోయాయి. నాతో ఒక మార్పును భావిస్తున్నాను. నిజానికి చూసినచో చర్చీలలో మంత్రాలు, మాయలు తప్ప మరేమి లేవు. వారికి మరే విషయాలు చెప్పలేక పోతున్నాము. కావున నేను మీ జమాఅత్‌లో చేరాలని నిశ్చయించుకున్నాను. ఎందుకనగా ఇక్కడే నాకు ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుంది. ఆ తరువాత వారు బైఅత్ చేసి జమాఅత్‌లో చేరారు.

బుకీనా ఫాసూ నుండి ఒక నూతన ముస్లిం మిత్రుడు నిస్సే బిస్సో గారు ఇలా వ్రాసారు: ఖలీఫతుల్ మసీహ్‌ని ప్రత్యక్షంగా చూడడం ఇదే మొదటి సారి. నేను కొన్ని రోజుల క్రితమే ఇస్లాం ధర్మమును స్వీకరించాను. ప్రపంచం తప్పకుండా ఒక నాయకుని చేతిలో ఏకం కావాలి అనే ఆలోచనల నాలో పదే పదే కల్గుచుండెను. ఇక్కడ జమాఅత్ అహ్మదియ్య ప్రజలను చూశాను. వారు ఐక్యమత్యముగా ఉండడం కనిపించింది. అందుకే నేను మీతోపాటు అహ్మదియ్య మస్జిద్‌లో నమాజ్ చదవడం ప్రారంభించాను. ఈ రోజు నేను జల్సా సాలాన యుకే మరియు అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమములో కూడ పాల్గొన్నాను. ఆ కార్యక్రమాలలో అహ్మదీయులందరు ఎంటిఏ ద్వారా పాల్గొన్నారు. నేను ఆ దృశ్యాలన్నింటిని నా కన్నులతో చూసిన తరువాత నాకు మనశ్శాంతి కల్గింది. అందరు ఒకే చేతిలో ఏకం కావాలని నేను ఆలోచించే దృశ్యాన్ని కూడ ఇక్కడ చూశాను. నా ప్రశ్నకు సమాధానం లభించింది. అందుకే నేను ఈ రోజు నుండి అహ్మదియ్యత్‌ను స్వీకరిస్తున్నాను అని ప్రకటిస్తున్నాను. నేను నా కుటుంబీకులను కూడ ఖిలాఫత్ అడుగుజాడలో నడవమని తెల్పుతాను.

శ్రీలంక కు చెందిన సదర్ జమాఅత్ అహ్మదియ్యత్‌ను స్వీకరించు విషయాన్ని తెల్పుచూ ఈ విధముగా వ్రాసారు: ప్రాంతీయ జమాఅత్‌లలో సామూహికముగా జల్సా కార్యక్రమాలను వినే చూసే ఏర్పాట్లు చేశాము. కొలంబోలోని జమాఅత్ సెంటర్‌లో దేశ పరిస్థితుల దృష్ట్యా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పాడినా కూడ 50 మంది అహ్మదీయులు, అహ్మదీయేతరులు జల్సా కార్యక్రమాలలో మరియు అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ సందర్భములో ఇద్దరు వ్యక్తులు బైఅత్ చేసి జమాఅత్‌లో చేరినారు. అదే విధముగా ప్రత్యక్ష ప్రసారాల ద్వారా నౌ గేంబో, పస్‌యాల మరియు పొలొనర్వాకు చెందిన జమాఅత్ సభ్యులు కూడ సామూహికముగా జల్సా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమాలన్నింటిని తమిళ భాషలో అనువదించబడ్డాయి. ఆయా కార్యక్రమాల దృష్ట్యా నలుగురు వ్యక్తులు అహ్మదియ్యత్‌ను స్వీకరించు భాగ్యాన్ని పొందారు.

అల్బానియాకు చెందిన నివేదిక ప్రకారం అక్కడ అనువాదం ను యూట్యూబ్‌లో ప్రత్యక్షంగా ప్రసారాలు చేశారు. అల్బానీయ, కోసూ, మఖ్దూనీయా, జర్మనీ వంటి దేశాలలో ఉన్నటు వంటి అల్బానీయ ప్రజలు విన్నారు. ప్రచారం చేయబడుచున్న ఒక అల్బానీయ ముస్లిం మిత్రుడు అల్బర్టు గారు మొదటి సారిగా జల్సా సాలాన యు.కే యొక్క ముగింపు కార్యక్రమాలలో పాల్గొన్నారు. జల్సా ముగిసిన తరువాత ఇలా అన్నారు. ఖలీఫతుల్ మసీహ్ గారి ప్రసంగం ఖుర్ఆన్ మజీద్ యొక్క సూక్తులు మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్ర మరియు విజ్ఞాన పరమైన ఆధారాలతో కూడినది. కాని చాలా సాధారణ పదాలలో ఉన్నది. మహిళల హక్కులను గూర్చి ఆరోపణలు చేయువారి ప్రశ్నలన్నింటికి సమాధానాలు ఖలీఫాగారు నేటి ప్రసంగంలో ఇచ్చారు. ఆ తరువాత వారు తిరిగి వెళ్ళిపోయిన కొంత సమయానికే ఫోన్ చేశారు. మరల అహ్మదియ్య జమాఅత్ మరియు జల్సా సాలాన కార్యక్రమాలను గూర్చి తన అభిప్రాయాలను వెల్లడిస్తునే ఉన్నారు. మరల ఇలా తెలిపారు. అహ్మదియ్య జమాఅత్‌యే నిజమైన ఇస్లామీయ ధర్మం. బైఅత్ నిబంధనలను గూర్చి ప్రస్తావించినప్పుడు వారు జమాఅత్ ప్రచురించిన ఒక అల్బానీయ పుస్తకంను ఆధారం చేసుకొని ఇలా అన్నారు. అందులో 10 బైఅత్ నిబంధనలు ఉన్నాయి. వాటిని నేను చదివాను. ఇప్పుడు నేను బైఅత్ చేయుటకు సిద్ధముగా ఉన్నాను అని కూడ అన్నారు. ఆ తరువాత వారు జమాఅత్‌లో చేరారు.

కోంగో బ్రెజావిల్‌కు చెందిన ఒక ముఅల్లిమ్ గారు ఈ విధముగా వ్రాసారు: బియోకో స్టేవీ అనే మహిళ భర్త ఒక్కరే తన కుటుంబంలో అహ్మదియ్యత్‌ను స్వీకరించారు. వారి భార్యకూడ అహ్మదియ్యత్‌ను స్వీకరించినచో బాగుండును అని వారు భావించారు. ప్రచారం కూడ చేస్తున్నారు, దుఆలు కూడ చేస్తున్నారు. కాని భార్య మాత్రం చర్చీని వదులుటకు సిద్ధముగా లేకుండెను. జల్సా సాలాన కార్యక్రమాలలో పాల్గొనుటకు వారిని ఆహ్వానించడం జరిగింది. మూడు రోజులు వారు జల్సా కార్యక్రమాలను చూశారు. జల్సా చివరి రోజున ఆ మహిళ ఇలా అన్నది. నేను మూడు రోజులుగా మా ఫాద్రీ మరియు మీ ఖలీఫా గారు చెప్పే విషయాలను పోల్చి చూస్తున్నాను. ఖలీఫా ప్రసంగంలోనే చాలా విషయాలున్నాయి. ప్రతి మాట మనస్సును తాకుతుంది. నిజానికి ఫాద్రి మాటలు మేము రోజు వింటాము. కాని ఎన్నడు ఇలాంటి భావనను పొందలేదు. వారి మాటలు ఎన్నడు మా మనస్సును ప్రభావితం చేయలేదు. ఆ తరువాత వారు బైఅత్ చేసి జమాఅత్‌లో చేరారు.

ఇవి ప్రజలకు చెందిన కొన్ని సంఘటనలు. వీటిని నేను మీ ముందు ప్రస్తావించాను. జల్సా సందర్భమును పురస్కరించుకోని మీరు కూడ జల్సా కార్యక్రమాలను చూశారు. గొప్ప గొప్ప వ్యక్తుల నుండి చాలా సందేశాలు అందినాయి. ప్రపంచ రాజకీయ, ప్రముఖ నాయకుల నుండి 126 సందేశాలు అందినాయి. 101 వీడియో సందేశాలు. 25 లిఖిత పూర్వక సందేశాలు. మంత్రులు, గవర్నర్‌లకు చెందిన సందేశాలు. యు.కేతో పాటు ఇతర అనేక దేశాల నుండి కూడ సందేశాలు అందాయి. వాటిలో అమెరికా, కెనడా, సేరలేవన్, యుగెండా, లైబీరియా, న్యూజిలాండ్, స్పేయిన్, హాలాండ్ వంటివి గలవు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలలో 53 దేశాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఆయాకార్యక్రమాల ద్వారా 53 దేశాల ప్రజలు యు.కే జల్సాలో పాల్గొన్నారు. యూరప్‌లో , ఆఫ్రికాలో, ఆసియాలో ఈ 53 దేశాలకు చెందిన 80 ప్రాంతాల నుండి ప్రజలు జల్సాలో పాల్గొన్నారు.

ప్రెస్ & మీడియా ప్రసారాలను చూసినచో ఈ సంవత్సరం కోవిడ్ వలన వారిని సాధారణంగా ఆహ్వానించలేదు. కాని ఔట్ లుట్స్‌కు చెందిన రెండు మీడియాలు మాత్రం ప్రత్యేక అనుమతిని తీసుకున్నాయి. కావున వారికి అనుమతినివ్వడం జరిగింది. ప్రెస్ సెక్షన్‌వారు ఈ సంవత్సరం మనం ప్రపంచానికి ఏవిధముగా జల్సా కార్యక్రమాలను గూరించి తెలియజేయాలి అని ఆందోళన చెందుతూ చాలెంజ్‌గా తీసుకున్నారు. కాని అల్లాహ్ తాలా ఈ విధముగా ఏర్పాటు చేశాడు. స్వయముగా వారే అనుమతిని తీసుకున్నారు. ఇద్దరు మీడియా వారు ఒకరు బీబీసి వారు, మరొకరు వేరే చానల్ వారు. ఇద్దరు వచ్చారు. వీరే గాకుండా బీబీసి, అయి టీవి, మెట్రో, ఎల్‌బీసి, బీబీసి రేడియో సరే, బీబీసి సౌత్ టోడే, బీబీసి న్యూజ్ వెబ్ సైట్ వంటివి పెద్ద ఎత్తున ప్రసారాలు చేశాయి. వారి నుండి సమాచారాన్ని సేకరించి ఇతర మీడియా వారు ప్రసారాలు చేశారు. ఈ విధముగా ప్రాంతీయ పరంగా కూడ 8 మీడియా చానల్స్ జల్సా కార్యక్రమాలను ప్రసారం చేశాయి. ఇవియే గాకుండా 28 వెబ్‌సైట్‌లు కూడ జల్సా సాలాన వార్తలను, సమాచారాన్ని ప్రచారం చేశాయి. ఆర్టికల్ ప్రచురించాయి. ఈ వెబ్‌సైట్‌ల ప్రసారాలు 20 మిలియన్‌ల ప్రజల వరకు చేరుకున్నాయి. ప్రింట్ మీడియాను చూసుకున్నచో పత్రికలలో జల్సా సాలానను గూర్చి సుమారు 14 ఆర్టికల్స్ ప్రచురించబడ్డాయి. ఆ వార్త ప్రతికలను చదువేవారి సంఖ్య 1.2మిలియన్‌లు గలదు. వివిద టీ.వి చానెల్ ద్వారా 32 కార్యక్రమాలలో జల్సా కార్యక్రమాలను ప్రసారం చేయడమైనది. ఆయా టీవి చానెల్స్‌ను చూసేవారి సంఖ్య 12 మిలియన్‌లకు పైబడి గలదు. రేడియో స్టేషన్‌లలో 33 కార్యక్రమాలలో జల్సా సాలానను గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఈ రేడియో చానల్స్‌ను వినేవారి సంఖ్య ఒక మిలియన్‌కు పైబడి ఉన్నది. సోసల్ మీడియా ద్వారా కూడ కొన్ని మీడియా ఔట్‌లెట్స్, పత్రకారులు, పబ్లిక్ ఫిగర్జ్‌లు జల్సా సాలాన ను గూర్చి సమాచారాన్ని పంపారు. ఆ సమాచారాన్ని చూసిన వారి సంఖ్య కూడ 12 మిలియన్‌లకు పైబడి గలదు. ప్రెస్ & మీడియా వారు కూడ వీడియోస్ తయారు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి కూడ 2 లక్షల 34 వేల మంది వరకు చేరాయి. అన్నింటిని కలిపి చూసినచో 57.5 మిలియన్ కంటే ఎక్కువ ప్రజల వరకు జల్సా కార్యక్రమాలను గూర్చి సమాచారం చేరింది.

జర్నలిస్ట్‌లకు రావడానికి అనుమతి లేదు కావున ప్రెస్ & మీడియా టీం యు.కే వారే జమాఅత్ యొక్క ప్రచార శాఖ సహాయంతో 32 మంది జర్నలిస్ట్‌లకు లంగర్ నుండి భోజనాన్ని పంపించారు. అందుకు కూడ వారు చాలా మంచి సమాధానాన్ని పంపారు. చాలా అభినందించారు. బీబీసి సౌత్ ప్రతినిధులు జర్నలిస్ట్ ఎడ్‌వర్డ్ సాల్ట్ ఇలా అన్నారు. నేను జల్సాలో చాలా బాగా సమయాన్ని గడిపాను. ఆతిథ్యం కూడ చాలా బాగా ఉన్నది. చాలా ఉపన్యాసాలను విన్నాను. చాలా బాగున్నాయి. రాబోవు రోజులలో కూడ నేను మీతోకలిసి పని చేస్తాను. మరొక జర్నలిస్ట్ టీవి నేత గారు ఇలా అన్నారు. మీ జమాఅత్ యొక్క విశాల దృక్పథాన్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. మరోక పాత్రికేయుడు నతాషా దేవన్ గారు ఇలా అన్నారు: నిజానికి మతాలన్ని సమానమే. మంచి వారు ప్రజలను ఐక్యమత్యంగా ఉంచడం కోసం, పేదలకు సహాయం చేయడం కోసం మతాన్ని ఉపయోగిస్తారు. కాని చెడ్డవారు మాత్రం మతాన్ని చెడు పనుల కోసం వాడుకుంటారు. జల్సా సాలాన ఖచ్చితముగా మంచి వారి పనికి ఉదాహరణ.

ఎంటిఏ వైపు నుండి జల్సా సాలాన ను పురస్కరించుకోని 1885 నాటి పోస్టర్స్‌ను, ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసింది. వాటి ద్వారా కూడ 40 మిలియన్ ప్రజల వరకు సమాచారం అందినది. 2 లక్షల 31 వేల

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 29 SEP 2022 Issue No. 39.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

మంది ఆయాపోస్టులను లైక్ చేశారు. సోషల్ మీడియాలో వాటిని గూర్చి చర్చించారు. 1236 వీడియోస్ అప్‌లోడ్ చేయడం జరిగింది. వాటిని 2 లక్షల 41 వేల మంది ప్రజలు చూశారు. వాటిని చూసిన వారి సమయాన్ని జమా చేసి చూసినచో 4లక్షల 70వేల గంటల సమయం అవుతుంది. ఎంటిఏ వేబ్‌సైట్‌ను 24వేల మంది 92 వేల సార్లు చూశారు.

ఎంటిఏ ఆఫ్రీకాకు చెందిన నివేధిక ఏమిటనగా, 20 టీవి చానల్స్‌లో జల్సా కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూపించడం జరిగింది. వాటిలో కొన్ని ప్రభుత్వ చానల్‌లు కాగా, మరికొన్ని ప్రైవేట్ చానల్స్. కొన్ని చానల్స్ దేశం మొత్తం చూసేవి. ఆయా చానల్స్‌లో గేంబియా జాతీయ టీవి, సేరలేవన్ జాతీయ టీవి, లైబీరియా జాతీయ టీవి, వీటితో పాటు అనేక ప్రైవేట్ చానల్స్ కూడ ఉన్నాయి. అంతర్జాతీయ్య బైఅత్ కార్యక్రమాన్ని కూడ ఆయా చానల్స్ చూపించాయి. 20 టీవి చానల్స్ ద్వారా నా ప్రసంగాలను చూపించడం జరిగింది. 45 మిలయన్ ప్రజల వరకు ఈ సందేశాలు అందాయి.

జల్సాకు చెందిన ప్రత్యక్ష ప్రసారాలు కాకుండా జల్సా సాలానను ఆధారం చేసుకొని న్యూస్‌ను తయారు చేసి ఆఫ్రీకా అంతట పంపించడం జరిగింది. ఈ క్రమంలోనే జల్సా యొక్క మూడు రోజులలో 15 చానల్స్ జల్సా సాలానను ఆధారం చేసుకొని వార్తలను ప్రసారం చేశాయి. ఈ వార్తలు 15 మిలియన్ మంది ప్రజల వరకు చేరుకున్నాయి.

రివ్యూ ఆఫ్ రిలీజియన్స్ ద్వారా కూడ చాలా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. సోషల్ మీడియా ద్వారా యూటూబ్ ద్వారా వాటిని కవరేజ్ చేయడమైంది. జల్సాను ఆధారం చేసుకొని 40 ఆర్టికల్స్‌ను వ్రాసారు. 12 వీడియోలను తయారు చేశారు. 110 కంటే ఎక్కువ పోస్ట్‌లను వేయడం జరిగింది. 3 లక్షల ప్రజల వరకు జల్సా ప్రసారాలు చేరినాయి.

మొత్తానికి అల్లాహ్ తాలా అనుగ్రహం వలన జల్సా యొక్క అసంఖ్యా ఫలములను అల్లాహ్ తాలా మనకు అందించాడు. నేను ముందుగా తెల్పినట్లుగా ఇక్కడికి వచ్చిన ఘటనలలో నుండి అభిప్రాయాల నుండి కొన్నింటినే ప్రస్తావించాను. అల్లాహ్ తాలా ప్రతి అహ్మదీయుని విశ్వాసాన్ని నమ్మకాన్ని పెంచును గాకా!, జల్సా ప్రభావాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతముగా స్థిరపర్చుగాకా!.

నమాజ్‌ల తరువాత కొందరి జనాజ నమాజ్‌లను చదివిస్తాను. మొదటి జనాజ ముకర్రం నుస్రత్ ఖుద్రత సుల్తానా గారిది. వీరు ముకర్రం ఖుద్రతుల్లాహ్ అద్నాన్ గారి శ్రీమతి. కొన్ని రోజుల క్రితం 55 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతురాలు క్రమం తప్పకుండా నమాజ్ సల్పేవారు. తహాజ్జుద్ చేసేవారు. ఒక స్వచ్ఛమైన, దైవదూత గుణాలు గల మహిళ. ఆసుపత్రిలో ఉన్నప్పుడు వారు డాక్టర్లందరికి ప్రచారం చేశారు. ఒక ముసల్మాను అరబ్ డాక్టర్ కూడ ఉన్నది. ఆమే నుస్రత్ గారి నుండి ఖుర్‌ఆన్ తిలావత్ వినడానికి వచ్చేది. అందుకు వారు ఆమేకు యాసీన్ అధ్యాయము చదివి వినిపించేవారు. ప్రతి విషయంలో ఖిలాఫత్ ప్రస్తావన చేసేవారు. ఖిలాఫత్ పట్ల చాలా విధేయత గలవారు. వారి బంధులలో అనేకులు అహ్మదీయేతరులే. వారందరికి మీరు ఈ కాలపు ఇమాం బైఅత్ చేయండి అని సందేశాన్ని పంపారు. వారి జ్ఞాపకార్థం వారి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి కుమారులలో ఒకరైన రజియల్లాహ్ నుఅమాన్ జామిఅ అహ్మదియ్య కెనడాలో విద్యనభ్యసించుచున్నారు. నుఅమాన్‌కు ఒక సోదరుడు ఒక సోదరి ఉన్నారు. వారి భర్త ఇలా తెలిపారు: నా భార్య ఒక జీవిత సమర్పితురాలిగా జీవితాన్ని జీవించింది. పిల్లల క్రమశిక్షణ విషయంలో తన శక్తినంతటిని కూడ గట్టింది. ఖిలాఫత్ పట్ల ఎక్కువ అభిమానం, అభిమతం ఉండేది. ప్రచారం చేయాలనే కుతూహలం ఎక్కువగా ఉండేది. నేను ముందుగా తెల్పినట్లుగా వారి పిల్లలలో కూడ ఈ ఉత్సాహాన్ని నింపారు. నేను కూడ వారి పిల్లలను చూశాను అందరిలో ప్రచారగుణం కనిపించింది. అసాధారణమైన ఉత్సాహాన్ని కల్గియుండేవారు. కొద్ది పాటి ఉత్సాహం కాదు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వారి పిల్లలకు ఒక ప్రత్యేక శిక్షణ ఇవ్వబడింది. వారికి చదువుకునే ఆకాంక్ష కూడ ఎక్కువ. అల్లాహ్ తాలా వారికి నేర్పును ఇచ్చాడు. వారి వలన బైఅత్‌లు కూడ అవుతుంటాయి. వారి ఒక కుమారుడు రజియల్లాహ్ నుఅమాన్ నేను మొదట చెప్పినట్లుగా ఇతడు జామిలో చదువుచున్నాడు. పైగా బాగా ప్రచారం చేస్తున్నాడు. అల్లాహ్ తాలా ఆ విద్యార్థికి మరియు ఇతర విద్యార్థులకు కూడ రాబోవు రోజులలో నిస్వార్థముగా ధార్మిక సేవ చేయు భాగ్యమును కల్పించుగాకా!. ఆ పిల్లలందరిని వారి తల్లి దుఆలకు వారసులను చేయుగాకా!. వారి మరొక కుమారుడు జరిఉల్లాహ్ అద్నాన్ ఇలా తెలిపారు: తల్లిగారు చాలా పుణ్యాత్మురాలు. ధార్మికత గలవారు, చెడు నుండి దూరముండువారు, ఒక ఆదర్శ అహ్మదీ మహిళ. అల్లాహ్ తాలా తో వారికి ఒక ప్రత్యేక అనుబంధం ఉన్నది. పిల్లల క్రమశిక్షణ విషయంలో చాల చింతన ఉండేది. అనుక్షణం అల్లాహ్ వైపు వారి చూపు ఉండేది. అనాథ పిల్లలను బాగా చూసుకునేది. బాల్యం నుండే వారికి అల్లాహ్ తాలా పై గట్టి నమ్మకం ఉండేది. వారికి క్యాన్సర్ ఉన్నది. ఆ విషయం తెలిసిన తరువాత కూడ వారు అల్లాహ్ తాలా ప్రీతిపై ప్రతీని వ్యక్తపరిచేది. పైగా అల్లాహ్ తాలాతో అనుబంధాన్ని పెంచుకొమ్మని, అల్లాహ్ తాలా పై మీకు కూడ గట్టి నమ్మకం ఉండాలని మాకు కూడ చెప్పేది. జీవితం మరణం గొప్ప విషయాలు కావని, కాని మానవుడు తన జీవితాన్ని అందరు సంతోషించేలా జీవించడమే గొప్ప అని, మానవులు తమ కర్మలతో తాము సంతృప్తి చెందేలా జీవించాలని డాక్టర్లతో కూడ అనేవారు. అల్లాహ్ తాలా వారి స్థాయిని అంతస్తును పెంచుగాకా! (ఆమీన్.)

రెండవ ప్రస్తావన ముకర్రం చౌద్రీలతీఫ్ అహ్మద్ జమిట్ గారిది. కొన్ని రోజుల క్రితం వీరు కూడ 79 సంత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్‌చేశారు. వారి వంశంలో అహ్మదియ్యత్ వారి తాతా గారైన హజ్రత్ చౌద్రీ ముహమ్మద్ దీన్ రజి వాస్తవ్యులు బాఖి నవేస్ ద్వారా వచ్చింది. వీరి పేరు అంజామే ఆథమ్ రూహాని ఖజాయిన్ సంపుటి 11, పుట 325లో 313 అనుచరుల పట్టికలో మూడవ సంఖ్యలో మియాఁ ముహమ్మద్ దీన్ పట్వారి బలాని జిల్లా, గుజరాత్ అని లిఖించబడి ఉన్నది. చౌద్రీ లతీఫ్ జమిట్ గారు 1966లో పంజాబ్ యూనివర్సిటి లాహోర్‌లో ఎం.ఎస్.సి మ్యాథ్స్ డిగ్రిని పొందారు. ఆ తరువాత విద్యా శాఖతో అనుబంధీకులైనారు. 1966 నుండి 68 వరకు తాలీముల్ ఇస్లాం రబ్వాలో లెక్చరర్‌గా సేవలందించు భాగ్యాన్ని పొందారు. అదే విధముగా 1968 నుండి 94 వరకు సుమారుగా 26 సంవత్సరాల పాటు సేరలేవన్‌లో విద్యా శాఖలో ఉపాధ్యాయుడిగా, ప్రిన్సిఫల్‌గా ఎంతో గొప్పగా సేవలందించారు. జీవిత సమర్పితులు. ఆఫ్రీకా నుండి తిరిగి వచ్చిన తరువాత వారు సుమారుగా 5 సంవత్సరాల పాటు నాయబ్ వకీలుల్ మాల్ ద్వితియంగా సేవలందించారు. ఆ తరువాత 7 సంవత్సరాల పాటు నాయబ్ వకీలుల్ మాల్ తృతియంగా సేవలందించారు. నేను ముందుగా తెల్పినట్లుగా సేరలేవన్‌లోని జమాఅత్ స్కూల్‌లో పాఠాలు చెప్పారు. 1971 లో వారు జీవితం అంకితం చేశారు. జనవరి 1, 2007 నుండి వారిని వకీలుల్ మాల్ సాలిస్‌గా నియమించడం జరిగింది. అలా వారి సేవ కార్యక్రమాలను చూసినచో సుమారు 50 సంవత్సరాలకు పైబడి ఉంటుంది. వారి శ్రీమతి రషీదా లతీఫ్ గారు ఇలా తెలిపారు. నా భర్త సేరలేవన్‌లో ఉన్నప్పుడు వారితో నా వివాహం జరిగింది. నేను అక్కడికి వెళ్ళిన తరువాత వెళ్ళి వెళ్ళగానే వారు నాతో ఇలా అన్నారు. ఒక జీవిత సమర్పితుడికి ఇక్కడ ఆసియా ఖండపు వంటకాలు వండుకోని తినాలంటే చాలా కష్టం. అందుకే జీవిత సమర్పితులు మరియు అతని భార్య వారు ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంత వంటకాలను అలవాటు చేసుకోవాలి. అందుకే ఇక్కడి వంటకాలు వండడం నేర్చుకో. అప్పుడే మనకు తరువాత రోజులలో సులువుగా ఉంటుంది. చాలా సున్నిత మనస్థత్వం గలవారు. చాలా శ్రద్ధను చూపేవారు. వారితో కలిసి పని చేసేవారు కూడ వారి పని విధానాన్ని కొనియాడేవారు. ప్రతి ఒక్కరు వారిని పొగిడేవారు. అల్లాహ్ తాలా వారిని మన్నించుగాకా!, కరుణించుగాకా!, వారి స్థాయి అంతస్తులను పెంచుగాకా!, వారి కుటుంబీకులకు సహానంను ఓర్పును ప్రసాదించు గాకా!. వారి కుమారుడు ఒకరు బాల్యంలోనే మృతి చెందాడు. ప్రస్తుతం వారికి ఇప్పుడు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నది. వారికి కూడ వారి తండ్రి వలే సత్కార్యములను కొనసాగించు భాగ్యమును కల్గించు గాకా!

(5వ పేజిలో చదువుము)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz